▸ భూకబ్జాదారులపై పీడీ యాక్టు

▸▸ అవసరమైతే నగర బహిష్కరణ

▸▸ 6న భూకబ్జాలపై ప్రత్యేకంగా ఫిర్యాదుల స్వీకరణ

▸▸ నగర పోలీస్ కమిషనర్ రవిశంకర్ అయ్యన్నార్

▸▸ 'డయల్ యువర్ సీపీ'లో అప్పటికప్పుడు ఓ భూ వివాదం పరిష్కారం



- వార్త 6వ పేజీలో

చెత్త తరలింపులో దోపిడీ!

అక్రమాలకు అడ్డాగా క్లోజ్డ్ కాంపాక్టర్ సిస్టమ్ (సీసీఎస్) యూనిట్లు

పాతనగరం, గాజువాక సీసీఎస్‌ల నిర్వహణపై ఆరోపణలు

▸▸ ఏటా నిర్వహణ వ్యయం పెంచుతున్న అధికారులు

▸▸ రెండేళ్ల కిందట రూ.2.8 కోట్లు ఖర్చు

▸▸ ప్రస్తుతం రూ.6 కోట్లకు పెరిగిన వ్యయం

▸▸ కాంట్రాక్టర్‌తో అధికారులు మిలాఖత్?



ఎన్‌టౌన్‌లోని క్లోజ్డ్ కాంపాక్టర్ సిస్టమ్ (సీసీఎస్) యూనిట్

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

జీవీఎంసీ పరిధిలో ఐదేళ్ల కిందట ఏర్పాటుచేసిన క్లోజ్డ్ కాంపాక్టర్ సిస్టమ్ (సీసీఎస్) యూనిట్లు కొంతమంది అధికారులతోపాటు కాంట్రాక్టర్‌కు వరంగా మారాయనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఏళ్లుగా ఒకే కాంట్రాక్టర్‌కు బాధ్యతలు అప్పగించడం, నిర్వహణ వ్యయం పెరగకున్నా...సీసీఎస్ యూనిట్ల వ్యయాన్ని ఏటా భారీగా పెంచేయడంపై అనుమానాలు వెల్లువెత్తుతున్నాయి. రెండేళ్ల కిందటితో పోల్చితే ప్రస్తుతం కాంట్రాక్టర్‌కు రెట్టింపు మొత్తాన్ని చెల్లిస్తుండడం దీనికి బలం చేకూరుస్తోంది. డీజిల్ ధరలు స్థిరంగానే ఉన్నప్పటికీ నిర్వహణ వ్యయాన్ని రెట్టింపు చేయడం వెనుక భారీగా చేతులు మారాయనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

జీవీఎంసీ పరిధిలో ప్రతిరోజూ సుమారు వెయ్యి టన్నుల చెత్త ఉత్పత్తి అవుతుంటుంది. క్లాప్ వాహనాలతో పాటు 'ఏకో వైజాగ్' పేరుతో ఏర్పాటుచేసిన ఎలక్ట్రిక్ వాహనాలు ఇంటింటికీ వెళ్లి చెత్తను సేకరించి, సమీపంలోని చెత్త నిల్వ కేంద్రాలు (ఎంఎస్ఎఫ్)లకు తరలిస్తాయి. అక్కడి నుంచి టిప్పర్లు, తారాస్ వంటి భారీ వాహనాల్లో కాపులుప్పాడలోని డంపింగ్ యార్డుకు చేర్చాలి. ఇలా తరలించే సమయంలో గాలికి చెత్త ఎగిరి రోడ్లపై, వెనుక వచ్చే వాహనాలపై పడుతుండేది. దీనికితోడు తడి చెత్తను రోజుల తరబడి నిల్వ ఉంచడంతో దుర్గంధంతో పాటు దోమల వ్యాప్తి చెందేవి. ఈ నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం ఘన వ్యర్థాల నిర్వహణ చట్టం-2016 రూపొందించింది. తడి, పొడి చెత్త నిర్వహణ, తరలింపునకు మార్గదర్శకాలను జారీ చేసింది. ఈ మేరకు క్లోజ్డ్ కాంపాక్టర్ సిస్టమ్ (సీసీఎస్)ను ఏర్పాటుచేసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వాలకు సూచించింది. ఈ విధానంలో నిల్వ కేంద్రాలకు వచ్చిన చెత్తను ఎప్పటికప్పుడు గల్లాపెట్టెలాంటి యంత్రంలో వేసి, ప్రత్యేక యంత్రంతో కంప్రెస్ చేసి బండిల్‌లా మారుస్తారు. దీనిని ట్యాంకర్ రూపంలోని భారీ వాహనంలోకి లోడ్ చేస్తారు. దానిని డంపింగ్ యార్డుకు తరలిస్తారు. దీనివల్ల చెత్త నిల్వ ఉండదు. చెత్తను డంపింగ్ యార్డుకు తరలించే సమయంలో ఎగిరిపోవడం వంటి సమస్య తలెత్తదు.

నగరంలో 2018 నుంచి...

ఈ విధానాన్ని జీవీఎంసీ అధికారులు 2018లో మొదటగా జోన్-4 పరిధి టౌన్‌కొత్తరోడ్డు, గాజువాకలోని చెత్త తరలింపు కేంద్రాల్లో ఏర్పాటుచేశారు. రూ.17 కోట్లు వెచ్చించి యంత్రాలతోపాటు 12 భారీ కాంపాక్టర్ వాహనాలను కొనుగోలు చేశారు. రెండుచోట్ల వీటి నిర్వహణ (డీజిల్, డ్రైవర్‌తోపాటు ఇతర సిబ్బంది నియామకం) కాంట్రాక్టర్‌కు అప్పగించేందుకు టెండరు పిలిచారు. ఏడాదిపాటు నిర్వహణకు ఒక్కోచోట సుమారు రూ.80 లక్షలకు రాసా ఇన్‌ఫ్రా కంపెనీ కాంట్రాక్టు దక్కించుకుంది. ఆ తరువాత డీజిల్ ధరలు, సిబ్బంది జీతాల పెరుగుదల పేరుతో ఏటా ... మిగతా 6వ పేజీలో

వీఎంఆర్‌డీఏ వింత పోకడ

ఫ్లోటింగ్ బ్రిడ్జిపై తొందరపాటు నిర్ణయాలు

▸▸ ఆదరాబాదరాగా ముందు అధికార పార్టీ నేతల చేతులమీదుగా ప్రారంభోత్సవం

▸▸ ఆ తరువాత చోటుచేసుకున్న పరిణామాలతో ఇప్పుడు ట్రయల్ రన్

▸▸ ఎక్కడెక్కడి నుంచో నిపుణులను రప్పిస్తున్న నిర్వాహక సంస్థ

▸▸ ముంబై నుంచి బృందం

▸▸ లోపాలు, ప్రమాదాలు చోటుచేసుకోకుండా తీసుకోవలసిన జాగ్రత్తలపై అధ్యయనం

▸▸ ఏదేమైనా అక్కడే కొనసాగించాలనే ధోరణిలో అధికారులు



ఫ్లోటింగ్ బ్రిడ్జి

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

అత్యంత వివాదాస్పదంగా మారిన ఫ్లోటింగ్ బ్రిడ్జిని ఏదోవిధంగా ఆర్కే బీచ్‌లోనే నడపాలని విశాఖ మహా నగర ప్రాంత అభివృద్ధి సంస్థ (వీఎంఆర్‌డీఏ) అధికారులు యత్నిస్తున్నారు. చేసిన తప్పును కప్పిపుచ్చుకోవడానికి కింద మీద పడుతున్నారు. ఎక్కడైనా ఏదైనా ప్రాజెక్టును చేపడితే...ముందు ట్రయల్ రన్ వేసి, లోపాలు ఏమైనా ఉంటే సవరించుకున్నాక, అంతా బాగుందని నిర్ధారించుకున్నాక ప్రారంభోత్సవం చేస్తారు. కానీ వీఎంఆర్‌డీఏ అధికారులు ఈ ప్రాజెక్టు విషయంలో రివర్స్‌లో వెళ్లారు. ముందు వైసీపీ నాయకులతో ఫ్లోటింగ్ బ్రిడ్జిని ప్రారంభింపజేసేశారు. ఆ తరువాత లోపాలు బయటపడడంతో ఇప్పుడు తీరుబడిగా ట్రయల్ రన్లు నిర్వహిస్తున్నారు. అవన్నీ 'సోషల్ మీడియా'లో వైరల్ అవుతున్నాయి. ఎక్కడెక్కడి నుంచో నిపుణులు అంటూ కొందరిని తీసుకువచ్చి పరిశీలన చేయిస్తున్నారు. ఈ క్రమంలోనే ప్రాజెక్టు నిర్వాహకులు ముంబైకు చెందిన ఓ బృందాన్ని తీసుకువచ్చి వారితో తనిఖీలు చేయించారు. ఎక్కడ లోపాలు ఉన్నాయి?, ఎటువంటి ప్రమాదాలు జరగకుండా ఏమి చేయాలి? అనే అంశాలను పరిశీలిస్తున్నారు.

చాలా ప్రమాదకరం

ఆర్కే బీచ్ చాలా ప్రమాదకరమైనది. పైగా... తీరం తరచూ కోతకు గురయ్యే ప్రాంతంలో ఫ్లోటింగ్ బ్రిడ్జి ఏర్పాటుచేశారు. ఈ స్థలం ఎంపికలో చేసిన పొరపాటును అధికారులు అంగీకరించడం లేదు. ఏయూ సముద్ర అధ్యయన విభాగం సూచించిందని వేలు అటు వైపు చూపిస్తున్నారు. కానీ ఆ విభాగానికి కూడా ఇలాంటి ప్రాజెక్టులపై అవగాహన లేదు. ఆంధ్రప్రదేశ్‌లో ఏర్పాటుచేసిన మొదటి ఫ్లోటింగ్ బ్రిడ్జి ఇది. ఆర్కే బీచ్ అయితే ఎవరి అనుమతి (ముఖ్యంగా అటవీ శాఖ) అవసరం లేదని తమకు తామే భావించి ఫ్లోటింగ్ బ్రిడ్జి ఏర్పాటుచేశారు. పర్యాటక శాఖ నుంచి కూడా సూచనలు తీసుకోలేదు.

ఆ రోజే గజ ఈతగాళ్ల సాయంతో...

ఈ ప్రాజెక్టును వైసీపీ నాయకులతో ప్రారంభింపజేసిన రోజున కూడా బలమైన అలలు వచ్చాయి. వైవీ సుబ్బారెడ్డి, అమర్‌నాథ్ తదితరులకు పక్కన గజ ఈతగాళ్లను పెట్టారు. ఏదైనా ప్రమాదం జరిగే ఎలా?, అని 'ఆంధ్రజ్యోతి' ముందే ఒక కథనం ప్రచురించడంతో గజ ఈతగాళ్లను ఏర్పాట ుచేశారు. అంతేకాకుండా ... మిగతా 6వ పేజీలో



వీఎంఆర్‌డీఏ చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరిస్తున్న సనపల చంద్రమౌళి

వీఎంఆర్‌డీఏ అభివృద్ధికి కృషి చేస్తా

▸▸ నూతన చైర్మన్ సనపల చంద్రమౌళి

విశాఖపట్నం, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): విశాఖ మహా నగర ప్రాంత అభివృద్ధి సంస్థ (వీఎంఆర్‌డీఏ) అభివృద్ధికి అన్ని విధాలుగా కృషిచేస్తానని నూతన చైర్మన్ సనపల చంద్రమౌళి అన్నారు. ఆయన శుక్రవారం వీఎంఆర్‌డీఏ కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. అనంతరం చిల్డ్రన్ ఎరీనాలో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ తన సేవలను గుర్తించి పెద్ద బాధ్యతను పార్టీ పెద్దలు అప్పగించారని, వారి ఆశయాల మేరకు పనిచేస్తానన్నారు.వార్డు స్థాయి నుంచి కష్టపడి వైసీపీలో పైకి వచ్చానని, తగిన గుర్తింపు లభించిందని సంతోషం వ్యక్తంచేశారు. వీఎంఆర్‌డీఏ పరిధిలో నాలుగు వేల ఎకరాల్లో జగనన్న ఇళ్ల నిర్మాణం జరుగుతోందని, అవన్నీ పేదలకు సక్రమంగా అందేలా చూస్తానన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ వరుదు కల్యాణి, ఉత్తర నియోజకవర్గ వైసీపీ ఇన్‌చార్జి కేకే రాజు, విశాఖ జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ కొండా రాజీవ్ గాంధీ, డిప్యూటీ మేయర్ కట్టమూరి సతీశ్ తదితరులు పాల్గొన్నారు. పలువురు చంద్రమౌళిని అభినందించారు.

అప్పన్న కేశఖండనశాలలో ఊడిపడ్డ పైకప్పు పెచ్చులు



పెచ్చులూడిన పైకప్పు - వివరాలు 6లో

ఇంటర్ పరీక్షలు ప్రారంభం



జిల్లాలో ఇంటర్ పరీక్షలు శుక్రవారం ప్రారంభమయ్యాయి. తొలిరోజు ప్రథమ సంవత్సరం సెకెండ్ లాంగ్వేజ్ పరీక్ష నిర్వహించారు. జిల్లా వ్యాప్తంగా 93 కేంద్రాల్లో నిర్వహించిన పరీక్షకు 98 శాతం మంది విద్యార్థులు హాజరయ్యారు. పరీక్షల నిర్వహణను సీసీ కెమెరాల ద్వారా ఆర్‌ఐవో కార్యాలయం నుంచి అధికారులు పర్యవేక్షించారు. కాగా శనివారం ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు పరీక్షలు ప్రారంభం కానున్నాయి. - వివరాలు 9లో

కార్యకర్తలకు అండగా ఉంటాం :

▸▸ నారా భువనేశ్వరి



అనకాపల్లి జిల్లా మునగపాక మండలం గవర్ల అనకాపల్లిలో శుక్రవారం ముతుర్తి వెంకటరావు కుటుంబానికి రూ.3 లక్షలు చెక్ అందజేస్తున్న నారా భువనేశ్వరి

అనకాపల్లి, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): అనకాపల్లి జిల్లాలో తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబు నాయుడు సతీమణి భువనేశ్వరి పర్యటనకు ప్రజల నుంచి విశేష స్పందన లభించింది. 'నిజం గెలవాలి' కార్యక్రమంలో భాగంగా తొలిసారి జిల్లాకు వచ్చిన ఆమెకు టీడీపీ శ్రేణులు, అభిమానులు ఘన స్వాగతం పలికారు. రెండు రోజులపాటు ఆమె అనకాపల్లి, చోడవరం, ఎలమంచిలి నియోజకవర్గాల పరిధిలోని పలు గ్రామాల్లో పర్యటించారు. గత ఏడాది చంద్రబాబు అరెస్టుతో మనస్తాపం చెంది ప్రాణాలు వదిలిన 11మంది టీడీపీ కార్యకర్తల ఇళ్లకు వెళ్లి బాధిత కుటుంబాలను స్వయంగా పరామర్శించారు. ఒక్కో కుటుంబానికి రూ.3 లక్షల చొప్పున ఆర్థిక సాయం చెక్కులు అందించారు. బాధిత కుటుంబాలకు టీడీపీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. గురువారం ఉదయం చోడవరం నియోజకవర్గం రోలుగుంట మండలంలో ప్రారంభించిన పర్యటన శుక్రవారం మధ్యాహ్నం ఎలమంచిలి నియోజకవర్గం మునగపాక మండలంలో ముగిసింది. కష్టకాలంలో కార్యకర్తలకు టీడీపీ అండగా నిలుస్తుందని ధైర్యం చెప్పారు.

ఎన్నాళ్లకెన్నాళ్లకు...

▸▸ ఉద్యోగులు, ఉపాధ్యాయులకు ఒకటో తేదీన జీతాలు

▸▸ ఏయూ ఉద్యోగులు, పెన్షనర్లకు ఒకేసారి రెండు నెలల వేతనం, పెన్షన్

▸▸ ఎన్నికల ట్రిక్‌గా పేర్కొంటున్న ఉద్యోగ వర్గాలు

విశాఖపట్నం, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల ముందు ఉద్యోగ, ఉపాధ్యాయ వర్గాలను ప్రసన్నం చేసుకోవడానికి రాష్ట్ర ప్రభుత్వం నానా తంటాలు పడుతుంది. అందులో భాగంగానే సుమారు మూడున్నరేళ్ల తరువాత దాదాపు అన్ని జిల్లాల్లోనూ ఉపధ్యాయులకు ఒకటో తేదీన జీతాలు జమ చేసింది. వచ్చే నెల కూడా ఒకటో తేదీన జీతాలు పడవచ్చునని, ఎన్నికల ముందు ఇదో ట్రిక్ అని పలువురు టీచర్లు వ్యాఖ్యానించారు. గత నెలలో తొలి వారంలో జీతాలు ఇచ్చిన ప్రభుత్వం, ఈ నెల ఒకటో తేదీన టీచర్ల ఖాతాలకు జీతాలు జమ చేసింది.

ఏయూ ఉద్యోగులకు...

ఇక ఆంధ్ర విశ్వవిద్యాలయం ఉద్యోగులకు, రిటైర్డ్ ఉద్యోగులకు సుమారు ఎనిమిది నెలల తరువాత ఒకటో తేదీన వేతనాలు, పింఛన్లు జమ అయ్యాయి. జనవరి నెలకు సంబంధించిన వేతనాలు, పెన్షన్లు ప్రభుత్వం ఫిబ్రవరి 29వ తేదీ వరకూ చెల్లించలేదు. దీంతో ఉద్యోగుల్లో ఆందోళన నెలకొంది. జనవరి నెల జీతమే అందలేదు, ఇక ఫిబ్రవరి నెల జీతం ఎప్పుడు వస్తుందోనని అనుకుంటుండగా శుక్రవారం ఉదయానికే జనవరి, ఫిబ్రవరి నెలలకు సంబంధించిన వేతనాలు, పింఛన్లు జమ అయ్యాయి. ఇలా ఒకటో తేదీన వేతనాలు, పింఛన్లు అందుకోవడం గడిచిన ఎనిమిది నెలల్లో ఇదే తొలిసారి అని, రెండేళ్లలో అయితే ఇది మూడోసారని చెబుతున్నారు. ఉద్యోగులు, రిటైర్డ్ ఉద్యోగులకు వేతనాలు, పెన్షన్లు సకాలంలో చెల్లించడం ద్వారా ఎన్నికల్లో లబ్ధి పొందేందుకు వైసీపీ ప్రభుత్వం చూస్తోందని, పలువురు పేర్కొన్నారు.

పారా హుషార్!!

▸▸ నగరంలో కొత్త దొంగల ముఠా

▸▸ అపార్టుమెంట్లలో తాళం వేసిన ఇళ్లే లక్ష్యం



దొంగల ముఠా సభ్యులు

విశాఖపట్నం, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): నగరంలో కొత్త దొంగల ముఠా సంచరిస్తోంది. అపార్టుమెంట్లలో తాళం వేసి ఉన్న ఫ్లాట్లను గుర్తించి, ఎవరూ లేని సమయం చూసి చోరీకి పాల్పడుతోంది. ఇప్పటికే పెందుర్తి, తదితర చోట్ల ఇలాంటి చోరీలు జరిగాయి. సీసీటీవీ కెమెరాల ఫుటేజీ ద్వారా పోలీసులు నిందితుల ఫొటోలు, ఇతర వివరాలను సేకరించారు. ఈ తరహా నేరాలు జరగకుండా అంతా అప్రమత్తంగా ఉండాలని సూచిస్తున్నారు.

ఎలా చేస్తారంటే..?

ఈ ముఠాలోని మహిళ ముందుగా అపార్టుమెంట్లకు వెళుతుంది. అనాధ పిల్లల ... మిగతా 6వ పేజీలో

విశాఖ దక్షిణ టికెట్ గండి బాబ్జీకే ఇవ్వాలి

» టీడీపీ అధిష్ఠానానికి నాయకులు అభ్యర్థన

విశాఖపట్నం, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): విశాఖ దక్షిణ నియోజకవర్గ టికెట్ తెలుగుదేశం అభ్యర్థిగా గండి బాబ్జీని అధిష్ఠానం ప్రకటించాలని ఆ పార్టీ నాయకులు కోరారు. శుక్రవారం జిల్లాపరిషత్ సమీపంలో ఓ కల్యాణమండపంలో నియోజకవర్గ పరిధిలో ముఖ్యనాయకులు, వార్డు అధ్యక్షులు తదితరులు సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ముఖ్యనేతలు మాట్లాడుతూ ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో బాబ్జీ ఎంపిక విషయం అధిష్ఠానం స్పష్టత ఇవ్వాలని కోరారు. అనంతరం వీరంతా పార్టీ విశాఖ పార్లమెంటు ఇన్‌చార్జి ఎం.శ్రీభరత్‌ను ఆయన స్వగృహంలో కలిసి బాబ్జీకి టికెట్ కేటాయించాలని అభ్యర్థించారు. ఈ విషయం అధిష్ఠానం దృష్టికి తీసుకువెళతానని శ్రీభరత్ హామీ ఇచ్చారు.

పీసీబీ జాయింట్ చీఫ్ ఇంజనీరుగా రమేష్

విశాఖ ఈఈ నాగిరెడ్డికి ఎస్ఈగా పదోన్నతి

విశాఖపట్నం, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): కాలుష్య నియంత్రణ మండలి విశాఖ జోన్ కార్యాలయం జాయింట్ చీఫ్ ఇంజనీరుగా కె.రమేష్‌ను నియమించారు. ప్రధాన కార్యాలయంలో ఎస్ఈగా పనిచేస్తున్న రమేష్‌కు జోనల్ కార్యాలయంలో పోస్టింగ్ ఇచ్చారు. ఇప్పటివరకు విశాఖ జాయింట్ చీఫ్ ఇంజనీరుగా అదనపు బాధ్యతలు నిర్వహిస్తున్న ప్రసాదరావుకు పదోన్నతి కల్పించి విజయవాడ ప్రధాన కార్యాలయంలో పోస్టింగ్ ఇచ్చారు. ప్రాంతీయ కార్యాలయంలోని ఈఈ నాగిరెడ్డికి ఎస్ఈగా పదోన్నతి కల్పించిన బోర్డు పోస్టింగ్ ఇవ్వలేదు. రాష్ట్రంలో ఏఈలుగా పనిచేస్తున్న మరో తొమ్మిదిమందికి ఈఈలుగా పదోన్నతి కల్పించారు. విశాఖ ప్రాంతీయ కార్యాలయంలో పనిచేస్తున్న ఏఈ పి.శ్రీనివాసరావుకు పదోన్నతి లభించింది.

ఘనంగా హజ్రత్ ఖాజా చందనోత్సవం

మద్రిపాలెం, మార్చి 1: మద్రి పా లెం జాకీరు హూ స్సేన్‌నగర్ మజీద్ ఈ అల్ ఖదీర్ ఆధ్వ ర్యంలో హజ్రత్ ఖాజా గరీబ్ నవాజ్ చందనోత్సవం శుక్ర వారం ఘనంగా నిర్వ హించారు. వేడుకల్లో భాగంగా పవిత్ర నమా జు ఆచరించిన ముస్లింలు మజీద్ ప్రాంగణంలో ఖురాన్ పఠించారు. అనంతరం మద్రి పాలెం, గ్రీన్‌గార్డెన్స్, పార్వతినగర్‌లో తదితర ప్రాంతాల్లో చాదర్ (పవిత్ర వస్త్రం)తో ర్యాలీ నిర్వహించి నిషానివద్ద ఫతేహా నిర్వహించారు. వైసీపీ కన్వీనర్ కేకే రాజు, బర్కత్అలీ చాదర్‌ను దర్శించుకున్నారు.మజీద్ కమిటీ అధ్యక్షుడుమున్నా, ఉర్స్ కమిటీ సభ్యులు పర్యవేక్షించారు.

ఆర్టీసీకి పెరిగిన ఆదాయం

ద్వారకాబస్‌స్టేషన్, మార్చి 1: బస్సుల సగటు ఆక్యుపెన్సీ రేషియో, రోజువారీ ఆదాయం పెరగడంతో ఆర్టీసీ అధికారులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. హైదరాబాద్, విజయవాడ, తిరుపతి, రాజమండ్రి, కాకినాడ సర్వీసులకు కూడా రిజర్వేషన్‌పూర్తికావడంతో సంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. మధురవాడ, విశాఖపట్నం, మద్దిలపాలెం, వాల్తేరు, సింహాచలం, గాజువాక, స్టీల్ సిటీ డిపోల పరిధిలోని 760 బస్సులు ఫిబ్రవరిలో రోజుకు సగటున 2.9 లక్షల కిలోమీటర్లు తిరిగి రూ.కోటి చొప్పున ఆదాయం సమకూర్చాయి. సగటు ఆక్యుపెన్సీ రేషియో 63 శాతంగా నమోదయిది., జనవరిలో రోజువారీ ఆదాయం రూ.95 లక్షలు, ఓఆర్ 58 శాతం నమోదైంది. మాఘమాసం కావడం శుభ ము హూర్తాలతో ప్రయాణికుల రాకపోకలు పెరిగాయని అధికారులు చెబుతున్నారు.

ఎన్‌సీసీ శిక్షణకు కేడెట్స్ ఎంపిక

అక్కయ్యపాలెం, మార్చి 1 : ఎన్‌జీజీఓస్ కాలనీలోని జీవీఎంసీ ఉన్నత పాఠశాలలో శుక్రవారం ఎన్‌సీసీ ఆర్మీ శిక్షణకు ఎంపిక జరిగింది. పాఠశాల ఎన్‌సీసీ ప్రథమ శ్రేణి ఉన్నతాధికారి ఎంఎన్‌వీ విశ్వనాధం ఆధ్వర్యంలో 2024-26లకు గాను ప్రవేశాలు జరిగాయి. పాఠశాలలోని 7, 8 తరగతి చదువుతున్న సుమారు 200 మంది విద్యార్థులకు దేహదారుఢ్య పరీక్షలు నిర్వహించగా 14 మంది బాలికలు జూనియర్ వింగ్‌గా, 10 మంది బాలురు జూనియర్ డివిజన్‌గా ఎంపికయ్యారు. హెచ్‌ఎం బి.లక్ష్మీనరస, కమాండింగ్ అధికారి కల్నల్ అజయ్ కుమార్,సుబేదార్ మేజర్ సజీవన్ కేకే, హవల్దార్లు శుక్ర, శ్యామల, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

భువనేశ్వరికి ఆత్మీయ వీడ్కోలు



విమానాశ్రయంలో భువనేశ్వరికి వీడ్కోలు పలుకుతున్న తెలుగుదేశం పార్టీ నాయకులు

గోపాలపట్నం, మార్చి 1: ఉత్తరాంధ్ర జిల్లాల్లో జరిగిన నిజం గెలవాలి కార్యక్రమంలో పాల్గొని తిరుగు ప్రయాణమైన తెలుగుదేశం పార్టీ అధినేత నారా చంద్రబాబు నాయుడు సతీమణి నారా భువనేశ్వరికి పార్టీ శ్రేణులు ఆత్మీయ వీడ్కోలు పలికారు. శుక్రవారం మధ్యాహ్నం విమానాశ్రయానికి చేరుకున్న ఆమెకు అనకాపల్లి పార్లమెంట్ నియోజకవర్గ ఇన్‌చార్జి బుద్దా నాగజగదీశ్, చోడవరం ఇన్‌చార్జి బత్తుల తాతయ్యబాబు, ఎలమంచిలి ఇన్‌చార్జి ప్రగడ నాగేశ్వరావు తదితరులు వీడ్కోలు పలికారు. అనంతరం ఆమె చెన్నై బయలుదేరి వెళ్లారు.

పోలింగ్ కేంద్రాల్లో మౌలిక వసతుల కల్పన: కలెక్టర్

మహరాణిపేట, మార్చి 1: జిల్లా వ్యాప్తంగా పోలింగ్ కేంద్రాల్లో మౌలిక వసతుల కల్పనకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్టు కలెక్టర్ ఏ మల్లికార్జున పేర్కొన్నారు. శుక్రవారం రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి ముఖేశ్ కుమార్ మీనా విజయవాడ నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా వివిధ జిల్లాల కలెక్టర్లతో మాట్లాడారు. ఈ సమావేశంలో జిల్లా కలెక్టర్ మల్లికార్జున మాట్లాడుతూ వికలాంగుల సౌకర్యార్థం కేంద్రాల్లో ర్యాం పులు వేశామని, అలాగే, తాగునీరు, గదుల్లో విద్యుత్ సంబంధిత ఏర్పాట్లు చేసినట్టు వివరించారు.

దుర్గాలమ్మ జాతరకు పందిరిరాట

పూర్ణామార్కెట్, మార్చి 1: పూర్ణామార్కెట్ దుర్గాలమ్మ జాతర మహోత్సవాల పందిరిరాటను ఎమ్మెల్యే వాసుపల్లి గణేశ్‌కుమార్ ఆధ్వర్యంలో వేదపండితులు శుక్రవారం వేయించారు. అనంతరం పూజలు చేశారు. మహాశివరాత్రి పర్వదినం రోజున ఈనెల 8తోపాటు 9 తేదీల్లో ఘనంగా జాతర జరగనుంది.

రుషికొండను నాశనం చేశారు

» బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు విష్ణుకుమార్ రాజు



మాట్లాడుతున్న విష్ణుకుమార్ రాజు

సీతమ్మధార, మార్చి 1: అద్భుత పర్యాటక ప్రాంతమైన రుషికొండను వైసీపీ ప్రభుత్వం నాశనం చేసి, ప్యాలెస్ నిర్మించడం శోచనీయమని మాజీ ఎమ్మెల్యే, బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు విష్ణుకుమార్ రాజు ఆవేదన వ్యక్తంచేశారు. సీతమ్మధారలోని పార్టీ కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పర్యాటక శాఖ అభివృద్ధి పేరుతో కోట్లాది రూపాయల ప్రజల సొమ్ము దుర్వినియోగం చేశారన్నారు. రుషికొండను బోడి గుండు చేసిన వైసీపీ ప్రభుత్వాన్ని తరిమి కొట్టాలని పిలుపునిచ్చారు. టీ పార్క్, రాడిసన్ బ్లూ అసలు యజమానులు ఎవరో తెలుస్తూనే ఉందన్నారు. అలాగే, మరో 15 రోజుల్లో ఎన్నికల నోటిఫికేషన్ రానుందని, జగన్ ఇచ్చిన మద్యనిషేధం మా టేమిటని ఆయన ప్రశ్నించారు. విద్యుత్ రేట్లు భరించలేక ఫ్యాక్టరీలు మూతపడ్డాయన్నారు. మళ్లీ జగన్‌కి ఓటు వేస్తే, పిల్లలు, రాష్ట్ర భవిష్యత్తుకు ఉరేసినట్టేనని ఆయన ఆందోళన వ్యక్తంచేశారు. దేశంలో జగన్ మార్చినట్లు ఎమ్మెల్యే సీట్లు ఎవరూ మార్చలేదన్నారు. జగన్ బటన్ నొక్కేది సాక్షి పేపర్‌కు ప్రకటనల కోసమే అన్నారు. వైసీపీ సిద్ధం పోస్టర్లు చూస్తే ఓటు వెయ్యకపోతే దాడి చేస్తామని బెదిరిస్తున్నట్లు ఉందన్నారు.

ఉచిత ఉపకరణాల నమోదు రేపు

ప్రధానమంత్రి వయోశ్రీ యోజన ఉచిత పరికరాల నమోదు కార్యక్రమాన్ని ఈ నెల 3వ తేదీన డీఎల్‌బీ గ్రౌండ్స్‌లో కేంద్ర ప్రభుత్వం అలింకో సంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నట్లు విష్ణుకుమార్ రాజు తెలిపారు. 60 ఏళ్లు పైబడిన తెల్ల రేషన్ కార్డు కలిగిన వారికి ఉచితంగా కళ్లద్దాలు, వీల్ చైర్లు, నడుం బెల్ట్‌లు, వినికిడి యంత్రాలు, ఊత కర్రలు, చంక కర్రలు తదితర పరికరాల కోసం పేర్లను నమోదు చేసుకోవాలని కోరారు.

రుషికొండను చూసేందుకు ప్రజలను అనుమతించాలి

» టీడీపీ జిల్లా అధ్యక్షుడు పల్లా శ్రీనివాస్

విశాఖపట్నం, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): ప్రజా ధనం వెచ్చించి నిర్మించిన రుషికొండ పర్యాటక భవనంపై ఎందుకు గోప్యత పాటిస్తున్నారని టీడీపీ జిల్లా అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు ప్రశ్నించారు. పార్టీ కార్యాలయంలో శుక్రవారం జరిగిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ప్రభుత్వ ఖజానా నుంచి రూ.450 కోట్లు వెచ్చించి ని ర్మించిన భవనం ప్రారం భోత్సవానికి మీడియాను అనుమతించక పోవడం దారుణమన్నారు. అత్యంత ఖరీదైన భవనం పర్యాటకుల కోసమా, సీఎం క్యాంపు కార్యాలయమా చెప్పలేని దౌర్భాగ్య స్థితిలో ప్రభుత్వం ఉందన్నారు. ప్రజలసొమ్ముతో నిర్మించిన భవనాన్ని చూసేందుకు ప్రజలనే ఎందుకు అనుమతించడం లేదని నిలదీశారు. రుషికొండ సమీప ఐఎన్‌ఎస్ కళింగలో రక్షణశాఖకు చెందిన అనేక కార్యకలాపాలు జరుగుతున్నందున నిషేధిత ప్రాంతంగా పరిగణిస్తారని, అదే కేటగిరీ లోకి రుషికొండ వచ్చిందా అని ప్రశ్నించారు. నాలుగేళ్లగా రుషికొండను నిషేధిత ప్రాంతంగా మార్చేసి, ఏమి నిర్మిస్తున్నారో చెప్పాలని అడుగుతున్నా స్పందించడంలేదన్నారు.

ప్రారంభోత్సవంలో పాల్గొన్న ఇద్దరు మంత్రులు పరస్పర విరుద్ధ ప్రకటనలు చేశారని, దీనిని బట్టి భవనంపై వారికే అవగాహన లేదని ఎద్దేవా చేశారు. పచ్చనికొండను ధ్వంసం చేయడం, జనాన్ని తీవ్ర ఇబ్బందికి గురిచేయడం లాంటి పిచ్చి పనులు చేసినందుకే సీఎం జగన్‌ను సైకో అనిఅంటున్నారని పల్లా అన్నారు.

సంక్షోభంలో వ్యవసాయరంగం

» సీపీఐ నేత సత్యనారాయణమూర్తి



మాట్లాడుతున్న సత్యనారాయణ మూర్తి

అల్లిపురం, మార్చి1: దేశంలో వ్యవసాయరంగం తీవ్ర సంక్షోభంలో ఉందని, ఈ స్థితిలో రైతులను ఆదుకోవాల్సిన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆ దిశగా చర్యలు చేపట్టడం లేదని సీపీఐ రాష్ట్ర సహాయకార్యదర్శి జెవిసత్యనారాయణమూర్తి ఆరోపించారు. శుక్రవారం స్థా నిక పార్టీ కార్యాలయంలో జరిగిన విశాఖ జిల్లా సమితి సమావేశంలో ఆయన మాట్లాడారు. దేశ, రాష్ట్ర రాజకీయ పరిణామాలు, రానున్న ఎన్నికల్లో పార్టీ అ వలంబించాల్సిన వైఖరిని వివరించారు. కేంద్రంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం వ్యవసాయరంగాన్ని ప్రైవేట్ పరం చేయడానికి ప్రయత్నిస్తోందని ఆరోపించారు. ఇక, రాష్ట్రంలో వైసీపీ ప్రభుత్వం ప్రజాపాలనను విస్మరించి రాష్ట్ర ప్రయోజనాలను కేం ద్రంలోని బీజేపీకి తాకట్టు పెట్టిందని విమర్శించారు.జిల్లా కార్యదర్శి ఎం.పైడిరాజు, కార్యవర్గ సభ్యులు ఆర్. శ్రీనివాసరావు, ఎ.విమల, కసిరెడ్డి సత్యనారాయణ, కె.సత్యాంజనేయ. జి.ఎస్.జె. అచ్యుతరావు పాల్గొన్నారు.

చట్ట వ్యతిరేక శక్తిగా వలంటీర్ వ్యవస్థ

» టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మహ్మద్ నజీర్ ధ్వజం



మహారాణిపేట, మార్చి 1: వైసీపీ ప్రభుత్వ నియమించిన వలంటీర్లను చట్టవ్యతిరేక శక్తుల మారుతున్నారని టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మహ్మద్ నజీర్ ఆరోపించారు. శుక్రవారంపార్టీ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన వలంటీర్ల వ్యవస్థపై మాట్లాడారు. వలంటీర్ వ్యవస్థ రానురాను మరీ దారుణంగా మారుతోందన్నారు. అధికార పార్టీ ఇన్‌చార్జిలు.. వలంటీర్ల ద్వారా ఓటర్లకు స్వీట్లు, డబ్బు, చీరలు పంపిణీ చేస్తున్నారన్నారు. వలంటీర్ల వ్యవస్థపై ప్రభుత్వం రూ. 9, 666 కోట్లు ఖ ర్చు చేసిందని తెలిపారు. చీరలు , డబ్బులు పంచుతూ, ఏకంగా గ్రూప్‌ల్లో పెడుతున్నారని, దీనిపై డీజీపీతో పాటు ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేయనున్నట్లు తెలిపారు

విశాఖ- పలాస ప్రత్యేక పాసింజర్ రైళ్లు బ్రహ్మపూర్ వరకు పొడిగింపు

విశాఖపట్నం, మార్చి 1: ప్రయాణికుల డిమాండ్ మేరకు విశాఖ, పలాస మధ్య రాకపోకలు సాగిస్తున్న 08532, 08531 నంబర్లు గల ప్రత్యేక పాసింజర్ రైళ్లను వయా సోంపేట, ఇచ్ఛాపురం మీదుగా బ్రహ్మపూర్ వరకు పొడిగిస్తున్నామని సీనియర్ డీసీఎం ఏకే త్రిపాఠి తెలిపారు. విశాఖ-బ్రహ్మపూర్ ప్రత్యేక పాసింజర్ (08532) రైలు ఈనెల మూడు నుంచి ప్రతిరోజు సాయంత్రం 5.45 గంటలకు విశాఖలో బయలుదేరి రాత్రి 11.10 గంటలకు బ్రహ్మపూర్ చేరుతుంది. తిరుగు ప్రయాణంలో బ్రహ్మపూర్-విశాఖ ప్రత్యేక పాసింజర్ (08531) రైలు ఈనెల నాలుగు నుంచి ప్రతిరోజు తెల్లవారుజాము 3.50కు బ్రహ్మపూర్‌లో బయలుదేరి 9.20 గంటలకు విశాఖ చేరుతుంది.

వీఎంఆర్‌డీఏ చైర్మన్‌కు అభినందనల వెల్లువ



చంద్రమౌళికి శుభాకాంక్షలు తెలుపుతున్న కేకే రాజు, మాజీ మంత్రి శ్రీనివాస్‌రావు తదితరులు

మాధవధార, మార్చి 1; విశాఖ మెట్రో పాలిటన్ రీజియన్ డెవలప్‌మెంట్ అథారిటీ (వీఎంఆర్‌డీఏ) చైర్మన్‌గా నియమితులైన ఉత్తర నియోజకవర్గంలోని మాధవధారకు ఎస్.చంద్రమౌళికి శుక్రవారం పలువురు ప్రముఖులు అభినందనలు తెలిపారు. ముందుగా ఆయన నివాసం నుంచి వెళ్లి మాధవధారలో కొండపై శ్రీ భ్రమరాంబిక మల్లికార్జున దేవస్థానం, శ్రీ లీలా మాధవస్వామి ఆలయాల్లో పూజల్లో పాల్గొని స్వామిలను దర్శించుకున్నారు. అనంతరం మాధవధార 48ఏ రూట్ బస్టాపు నుంచి సిరిపురం వరకు వైసీపీ అభిమానులు, నాయకులు ఏర్పాటు చేసిన ర్యాలీగా వీఎంఆర్‌డీఏ కార్యాలయానికి చేరారు. అక్కడ ఉత్తర నియోజకవర్గ వైసీపీ ఇన్‌చార్జి కేకే రాజు, మాజీ మంత్రి ముత్తంశెట్టి శ్రీనివాసరావు, డిప్యూటీ మేయరు కె.సతీశ్, ఎమ్మెల్సీ వరుదు కల్యాణి తదితరులు, పార్టీల నాయకులు పుష్ప గుచ్ఛాలు అందించి నూతన చైర్మన్‌కు అభినందనలు తెలిపారు.

'దక్షిణం' టికెట్ ఇవ్వాలి

» జగదాంబ మక్కామసీద్ వద్ద ముస్లిం వర్గాలు ఆందోళన



నిరసన వ్యక్తంచేస్తున్న ముస్లింలు

జగదాంబ కూడలి, మార్చి 1: ముస్లీం మైనార్టీలకు రాజకీయాల్లో ప్రాధాన్యత కల్పించిన పార్టీలకే తమ మద్దతు ఉంటుందని జగదాంబ మక్కామసీద్ కమిటీ అధ్యక్షుడు షేక్ అబ్దుల్ మున్నీర్ స్పష్టంచేశారు. శుక్రవారం మసీద్ వద్ద ముస్లీం మైనార్టీ వర్గాలు ఆందోళన చేపట్టాయి. ఈసందర్భంగా మున్నీర్ మాట్లాడుతూ, ఎన్నికల్లో ప్రతిసారీ ప్ర ధాన రాజకీయ పార్టీలు తమకు రాజకీయ ప్రాధాన్యత కల్పించడంలో వివక్షత చూపుతున్నాయని ఆరోపించారు. విశాఖ నగరంలో దాదాపు మూడు లక్షలకు పైగా ము స్లీంలు ఉన్నారన్నారు. ఈ స్థితిలో దక్షిణ నియోజవర్గంలో తమ వర్గం వ్యక్తి పోటీ చేసే అ వకాశం కల్పించాలని డిమాండ్ చేశారు. ఏ రాజకీయపార్టీ అయితే తమ వారికి ఎమ్మెల్యే టికెట్ ఇస్తుందో దానికే సహకరిస్తామన్నారు.ఈప్రదర్శనలో మక్కామసీద్ కమిటీ ప్రతినిధులు, నగరంలోని ముస్లీంలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

44,177 మందికి 'విద్యా దీవెన '

» జేసీ మయూర్ అశోక్



లబ్ధిదారులకు చెక్కును అందజేస్తున్న జేసీ మయూర్ అశోక్

మహారాణిపేట, మార్చి 1: జిల్లా వ్యాప్తంగా జగనన్న విద్యా దీవెన పథకం కింద రూ.34.73 కోట్లు 44,177 మంది పిల్లల తల్లుల ఖాతాల్లోకి జమచేసినట్టు జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్ తెలిపారు. పేద విద్యార్థుల పూర్తి ఫీజు రియింబర్సుమెంట్ కింద 2023 అక్టోబర్ నుంచి డిసెంబరు వరకు త్రైమాసికానికి ఈ పథకం నిధులను శుక్రవారం ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి కృష్ణా జిల్లా పామర్రు నుంచి విడుదల చేశారు. కలెక్టరేట్ కార్యాలయంలో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈసందర్భంగా జేసీ మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా పాలిటెక్నిక్, ఐటీఐ, డిగ్రీ ఇంజనీరింగ్, మెడిసిన్ తదితర కోర్సులు చదువుతున్న 44177 మంది విద్యార్థులకు త్రైమాసిక నిధులు జమ చేసినట్టు చెప్పారు. అనంతరం నమూనా చెక్కును విద్యార్థుల తల్లులకు అందించారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు కోలా గురు వులు, పిల్లి సుజాత, కె. రామారావు , అధికారులు కె, శ్రీ దేవి పాల్గొన్నారు.

బుల్లయ్య కాలేజీ స్వర్ణోత్సవ ర్యాలీ



ర్యాలీని ప్రారంభిస్తున్న కరస్పాండెంట్ మధుకుమార్

సీతమ్మధార, మార్చి 1: డాక్టర్ లంకపల్లి బుల్లయ్య కళాశాల స్వర్ణోత్సవాలు పురస్కరించుకుని విద్యార్థులు ఎలక్ట్రిక్ సైకిళ్ల అవగాహన ర్యాలీని నిర్వహించారు. కళాశాల ఆవరణలో ఈ ర్యాలీని సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ డాక్టర్ జి.మధుకుమార్ శుక్రవారం జెండా ఊపి ప్రారంభించారు. ఈ ర్యాలీ జంగదాంబ జంక్షన్, కలెక్టర్ ఆఫీస్ కార్యాలయం, బీచ్ రోడ్డు, వుడా పార్క్ జంక్షన్, ఆంధ్రా యూనివర్శిటీ, సీఎంఆర్ సెంట్రల్ జంక్షన్ వరకు 8.5 కిలోమీటర్ల మేర సాగింది. ఈ సందర్భంగా మధుకుమార్ మాట్లాడుతూ కళాశాల స్వర్ణోత్సవాలపై ప్రచారంతోపాటు ప్రతి ఒక్కరికీ వ్యాయామం ప్రాధాన్యం తెలిపేలా ఈ ర్యాలీ సాగిందన్నారు. అధ్యాపకులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన

అల్లిపురం,మార్చి 1: జీవీఎంసీ 34వ వార్డులోని కొబ్బరితోట ఎస్‌పీపీ నగర్‌లో రూ. 18.50 లక్షల వ్యయంతో నిర్మించిన వాడబలిజ సేవాసంఘం సామాజిక భవనాన్ని శుక్రవారం స్థానిక ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ వార్డు కార్పొరేటర్ తోటపద్మావతితో కలసి ప్రాంభించారు. వార్డు నాయకులు లింగం శ్రీను, లండా రమణ తదితరులు పాల్గొన్నారు.

నాన్ ఫేర్ రెవెన్యూలో వాల్తేరు డివిజన్ రికార్డు: డీఆర్‌ఎం



డీఆర్‌ఎం సౌరభ్ ప్రసాద్

విశాఖపట్నం, మార్చి 1: నాన్ ఫేర్ రెవెన్యూలో వాల్తేరు డివిజన్ సరికొత్త రికార్డు నెలకొల్పింది. ఈ సందర్భంగా డీఆర్‌ఎం సౌరభ్‌ప్రసాద్ శుక్రవారం నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. గత సంవత్సరంలో పోల్చితే ఈ ఏడాది నాన్ ఫేర్ రెవెన్యూ 48 శాతం పెరిగిందని, ఏప్రిల్ 2023 నుంచి ఫిబ్రవరి 2024 నెలాఖరునాటికి రూ.7.61 కోట్ల ఆదాయం సమకూరినట్టు చెప్పారు. ఎయిర్ కండిషన్డ్ లాంజ్‌లు, కోచ్ రెస్టారెంట్, వందేభారత్ ఎక్స్‌ప్రెస్‌లలో ప్రచార ప్రకటనలు తదితర కార్యకలాపాలను విజయవంతంగా నిర్వహించిన నేపథ్యంలో నాన్ ఫేర్ రెవెన్యూలో డివిజన్ పురోగతి సాధించిందన్నారు. రెస్టారెంట్లను మరిన్ని స్టేషన్లకు విస్తరించడం, 15 అమృత స్టేషన్లలో ఫుడ్ కోర్టులు, వాణిజ్య జోన్‌ల ఏర్పాటు, స్టేషన్ స్థలాల లీజుకు కేటాయింపు, ఆధునిక సదుపాయాలు కల్పన తదితర ప్రణాళికల ద్వారా మరింత ఆదాయం పెంపునకు చర్యలు చేపట్టనున్నట్టు ఆయన పేర్కొన్నారు.

వైభవంగా పార్వతీపరమేశ్వరుల తిరువీధి



స్వామివారి ఊరేగింపులో భక్తులు

సీతంపేట, మార్చి 1: సీతంపేట గణేష్‌నగర్‌లోని పార్వతీశ్వరాలయ వార్షికోత్సవంలో భాగంగా పార్వతీ పర మేశ్వరుల కల్యాణం గురువారం కన్నులపండువగా నిర్వహించారు. ఇందులో భాగంగా స్వామిని, అమ్మవారికి వీధుల్లో వాహనంపై శుక్రవారం ఊరేగించారు.కల్యాణానికి భక్తులు తెచ్చిన సారెతో ఈ వేడుక సాగింది.

భూకబ్జాదారులపై పీడీ యాక్టు

» అవసరమైతే నగర బహిష్కరణ
» 6న భూకబ్జాలపై ప్రత్యేకంగా ఫిర్యాదుల స్వీకరణ
» నగర పోలీస్ కమిషనర్ రవిశంకర్ అయ్యన్నార్
» 'డయల్ యువర్ సీపీ'లో అప్పటికప్పుడు ఓ భూ వివాదం పరిష్కారం

విశాఖపట్నం, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): భూకబ్జాలకు పాల్పడే వారిపై పీడీ యాక్ట్ కింద కేసులు నమోదు చేస్తామని, అవసరమైతే నగర బహిష్కరణ కూడా చేస్తామని పోలీస్ కమిషనర్ రవిశంకర్ అయ్యన్నార్ హెచ్చరించారు. 'డయల్ యువర్ సీపీ' కార్యక్రమంలో శుక్రవారం ఆయన అప్పటికప్పుడు ఓ భూ వివాదాన్ని పరిష్కరించారు. కార్యాలయంలో మధ్యాహ్నం ఫిర్యాదులను చూస్తుండగా ఎండాడకు చెందిన 94 ఏళ్ల వృద్ధురాలు ఎ.యు.భాస్కరదేవి వచ్చారు. తనకు మధురవాడలో విలువైన భూమి ఉందని, దానిని కొందరు కబ్జా చేయడానికి యత్నిస్తున్నారని ఫిర్యాదు చేశారు. వివరాలు పరిశీలించిన సీపీ రవిశంకర్, జాయింట్ సీపీ ఫకీరప్ప, సీనియర్ సిటిజన్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు సీహెచ్ వెంకటరావు, అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి టీఎస్ ప్రసాద్‌తో కలిసి వెంటనే మధురవాడలో ఆ స్థలాన్ని పరిశీలించారు. సంబంధిత సీఐ, ఏసీపీలను పిలిచి తగు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సంఘటనా స్థలంలోనే ఆ ఫిర్యాదును పరిష్కరించారు. తక్షణమే న్యాయం చేసినందుకు భాస్కరదేవి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా సీపీ రవిశంకర్ మాట్లాడుతూ నకిలీ పత్రాలు సృష్టించి భూములు ఆక్రమించే వారిపై, భూకబ్జాదారులపై ఫిర్యాదుల స్వీకరణకు అన్ని పోలీస్ స్టేషన్లలో ఈ నెల 6వ తేదీ ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకూ పోలీసు ఉన్నతాధికారిని అందుబాటులో ఉంచుతామన్నారు. కబ్జాదారులకు సహకరించే ప్రభుత్వ ఉద్యోగులు, ప్రైవేటు వ్యక్తులు, రిటైర్డ్ ఉద్యోగులపై కూడా కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ఇలాంటి అంశాలపై ఫొటోలు, వీడియోలు ఏమైనా ఉంటే తన నంబరు 9493396633 కు వాట్సాప్ ద్వారా తెలియజేయవచ్చునన్నారు.

అప్పన్న కేశఖండనశాలలో ఊడిపడ్డ పైకప్పు పెచ్చులు

» త్రుటిలో తప్పిన పెనుప్రమాదం



ఊడిపడ్డ శ్లాబ్ పెచ్చులు

సింహాచలం, మార్చి 1: సింహాచలం దేవస్థానానికి చెందిన కేశఖండనశాలలోశుక్రవారం పైకప్పు పెచ్చులూడి పడ్డాయి. అయి తే ఆ సమయంలో అక్కడ భక్తులు లేకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. మధ్యాహ్నం 11 గంటల సమయంలో కేశఖండనశాలలో కొందరు భక్తులు తలనీలాలు సమర్పిస్తున్నారు. అదే సమయంలో భవనం తూర్పువైపు పైభాగంలో పెచ్చులూడిపడ్డాయి. అక్కడ ఎవరూ లేకపోవడంతో ఎటువంటి ప్రమాదం జరగలేదు. ఈ సమాచారం తెలిసిన వెంటనే ఈఓ శ్రీనివాసమూర్తి ఆ ప్రాంతాన్ని పరిశీలించి, తాత్కాలిక ఏర్పాట్లు చేయాలని సిబ్బందిని ఆదేశించారు. కాగా, కేశఖండనశాల భవనానికి 1986లో శంకుస్థాపన చేయగా 1987లో అప్పటి అనువంశిక ధర్మకర్త డాక్టర్ పీవీజీ రాజు ప్రారంభించారు. సు మారు ఏడాది క్రితం కొండపై అభివృద్ధి పనుల పరిశీలనకు వచ్చిన దేవదాయ శాఖ ఇంజనీరింగ్ విభాగం సీఈ కేశఖండనశాల భవనాన్ని పరిశీలించి ప్రమాదకరంగా ఉందని, తక్షణం కూల్చివేయాల్సిందిగా చెప్పారు. కానీ దేవస్థానం అధికారులు పట్టించుకోలేదు. శ్లాబ్ పెచ్చులుఊడిపడుతుండడంతో క్షురకులు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు.

వన్‌టౌన్ 'దండుపాళ్యం గ్యాంగ్ లీడర్' అరెస్ట్

జగదాంబ కూడలి, మార్చి 1: నకిలీ తుపాకీతో నేరాలకు పాల్పడుతున్న విశాఖ వన్‌టౌన్ దండుపాళ్యం గ్యాంగ్ లీడర్‌ను పోలీసులు అరెస్టు చేశారు. వన్‌టౌన్ సీఐ భాస్కర్ అందించిన వివరాలివి.. శివారు ప్రాంతాలను టార్గెట్ చేసుకున్న గ్యాంగ్ లీడర్ ధోని సతీశ్‌కుమార్ అలియాస్ గసగసాలు, అతని అనుచరుడు మనోజ్‌కుమార్ అలియాస్ మారి వన్‌టౌన్ పంజా జంక్షన్ వద్ద ఇటీవల ములగాడ పవన్‌కుమార్ నుంచి ఐఫోన్, అతని వద్ద ఉన్న రూ. 2,500 దౌర్జన్యంగా దోచుకుపోయారు. బాధితుడి ఫిర్యాదుపై ఈకేసు దర్యాప్తులో భాగంగా గురువారం గ్యాంగ్ లీడర్ సతీష్ తోపాటు అతని అనుచరుడు మనోజ్‌కుమార్‌ను అరెస్ట్ చేశారు.ధోని సతీశ్‌పై నగరంలోని అనేక పోలీస్‌స్టేషన్ల పరిధిలో 30 కేసులు ఉన్నట్లు తెలిపారు. గంజాయి, దొంగతనం తదితర అనేక నేరారోపణల్లో ఇప్పటికే జైలు శిక్ష పడినట్లు చెప్పారు.అతని నుంచి 30 సెల్‌ఫోన్లు, నకిలీ తుపాకీ, నగదు స్వాధీనం చేసుకున్నామన్నారు. పలు సెక్షన్లపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ తెలిపారు.

చెత్త తరలింపులో దోపిడీ!

... 5వ పేజీ తరువాయి

నిర్వహణ ఖర్చు పెంచుతున్నారు. దీంతో రెండేళ్ల కిందట సుమారు రూ.1.4 కోట్లకు (ఒక్కొక్కటి) చేరింది. అయితే తాజాగా రెట్టింపు మొత్తానికి అంటే సుమారు రూ.మూడు కోట్లకు పెంచేశారు. అంటే రెండుచోట్లా కలిపి ఏడాదికి రూ.ఆరు కోట్లు చెల్లించాల్సి ఉంటుంది. ఒకేసారి నిర్వహణ వ్యయం రెట్టింపు చేయడంపై అనుమానాలు వ్యక్తంచేస్తున్నారు. రెండేళ్లుగా డీజిల్ ధరలు దాదాపు స్థిరంగానే ఉన్నాయి. సిబ్బంది జీతాలు కూడా పెద్దగా పెంచింది లేదు. కానీ, నిర్వహణ వ్యయం రెట్టింపు చేస్తూ అధికారులు ప్రతిపాదనలు చేయడం, కౌన్సిల్ ఆమోదించడంపై ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

కాంట్రాక్టర్‌తో మిలాఖత్!

సీసీఎస్ నిర్వహణ బాధ్యతలు దక్కించుకుంటున్న కాంట్రాక్టర్‌తో జీవీఎంసీలోని మెకానికల్, ప్రజారోగ్య విభాగం అధికారులు మిలాఖత్ అయ్యారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ విధానం ప్రారంభించినప్పటి నుంచి ఒకే కాంట్రాక్టర్ కొనసాగుతున్నారు. మిగిలిన కాంట్రాక్టర్లు టెండర్‌లో పాల్గొనాలనుకున్నా అనుభవం ఉండాలని నిబంధన పెడుతున్నారు. పైగా ఒక్కోసారి అధికారులు అత్యవసరం పేరుతో ప్రైవేటు వాహనాలను ఏర్పాటుచేసి వాటికి రూ.20 లక్షలు, 30 లక్షలు వరకూ ఖర్చు చేసేలా స్టాండింగ్ కమిటీలో ఆమోదం తీసుకుంటున్నారు. దీనివల్ల జీవీఎంసీకి అదనపు వ్యయం అవుతోంది. జీవీఎంసీ పరిధిలో ముడసర్లోవ, చీమలాపల్లి, భీమిలిల్లో కూడా సీసీఎస్‌లను ప్రారంభించేందుకు కసరత్తు చేస్తున్నారు. వాటి నిర్వహణ కూడా రాసా ఇన్‌ఫ్రాకే కట్టబెట్టాలని భావిస్తున్నట్టు సమాచారం. ఈ వ్యవహారంపై జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్‌వర్మ దృష్టిసారిస్తే అక్రమాలు బయటపడతాయని ఇంజనీరింగ్ విభాగానికి చెందిన కొంతమంది అధికారులు అభిప్రాయపడుతున్నారు.

వీఎంఆర్‌డీఏ వింత పోకడ

... 5వ పేజీ తరువాయి

ఓ బోటును కూడా సిద్ధంగా ఉంచుకున్నారు. అది చాలా తక్కువ సామర్థ్యం కలిగినది కావడం గమనార్హం. తీరం దగ్గర వచ్చే బలమైన అలలకే ఆ బోటు అంత ఎత్తున ఎగిరి పడుతోంది. దానిని నడిపేవారు కూడా పైకి ఎగురుతున్నారు. ఫ్లోటింగ్ బ్రిడ్జిపై నిల్చొన్నవారు కూడా అలలు వస్తే పైకి ఎగరాల్సి వస్తోంది. అక్కడ గజఈతగాళ్లు కూడా పక్కన ఏర్పాటుచేసిన ప్లాస్టిక్ స్తంభాలను గట్టిగా పట్టుకుంటున్నారు. వాటిలో కొన్ని ఇప్పటికే విరిగిపోయాయి. ఇలాంటి ప్రాజెక్టులను ఇలా అలలు ఎక్కువగా ఉండే చోట కాకుండా ప్రశాంతంగా ఉండే ప్రాంతంలో పెట్టుకోవడం మంచిదనే వాదనలు వినిపిస్తున్నాయి.

అన్నీ ఆర్‌కే బీచ్‌లోనేనా..?

విశాఖపట్నంలో ఏ పర్యాటక ప్రాజెక్టు ప్రారంభించాలన్నా దానిని తీసుకువచ్చి ఆర్‌కే బీచ్‌లో పెడుతున్నారు. తెన్నేటి పార్కు నుంచి భీమిలి వరకూ అనేక బీచ్‌లు ఉన్నాయి. వాటిలో పెద్దగా లోతు లేని తీరాన్ని ఎంపిక చేసుకుని ఉంటే బాగుండేది. కానీ అనుమతులు రావడంలో జాప్యం అవుతుందని, ఆర్‌కే బీచ్ అయితే ఎవరికీ ఫైల్ పెట్టాల్సిన అవసరం లేదని దూకుడుగా వెళ్లడం వల్లే ఇప్పుడు సమస్యలు వచ్చాయని అధికారులే అంటున్నారు. అడుగు ముందుకు వేసిన తరువాత వెనుక అడుగు వేస్తే పరువు పోతుందని ఆలోచిస్తున్నారు. పర్యాటకుల ప్రాణాలకు ముప్పు ఉందని తెలిసినా...ఈ ఫ్లోటింగ్ బ్రిడ్జిని అక్కడే నడపడానికి యత్నిస్తున్నారు.

పారా హుషార్!!

... 5వ పేజీ తరువాయి

శరణాలయం నిర్వహిస్తున్నామని సాయం చేయాలని కోరుతుంది. ఈ క్రమంలో ఏయే ఫ్లాట్లకు తాళాలు వేసి ఉన్నాయో గమనిస్తుంది. ఆ వివరాలన్నీ ముఠాలోని నాయకుడు ఆవుల కిరణ్‌కుమార్ అలియాస్ రాహుల్‌కు చెబుతుంది. ఆ తరువాత రాహుల్ రంగంలో దిగి రెక్కీ నిర్వహిస్తాడు. ఏ సమయంలో అక్కడికి వెళ్లి చోరీ చేయవచ్చునో ఒక అంచనాకు వస్తాడు. ఆ ప్రకారం ఫ్లాట్ తాళం విరగొట్టి లోపలకు వెళ్లి విలువైన సొత్తు దోచుకుపోతాడు. ఈ ముఠాలో మరికొందరు సభ్యులు కూడా ఉన్నారు. వీరంతా మారుతీ కారులో తిరుగుతున్నారు. ఈ వివరాలను అన్ని పోలీస్ స్టేషన్లకు పంపించారు. అక్కడి నుంచి సచివాలయాల్లో పనిచేసే మహిళా కానిస్టేబుళ్లకు అందించారు. వారి ద్వారా అన్ని అపార్టుమెంట్లకు చేరవేస్తున్నారు. ఏ ఇంటికైనా, అపార్టుమెంట్‌కైనా అనాథ శరణాలయం, సాయం పేరుతో మహిళలు వస్తే...వెంటనే ఆ సమాచారాన్ని సమీప పోలీస్‌స్టేషన్‌కు అందించాలని నాలుగో పట్టణ క్రైమ్ ఎస్ఐ భాస్కర్ కోరారు. అంతా అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

జిల్లా కబడ్డీ జట్టు ఎంపిక రేపు

అక్కిరెడ్డిపాలెం, మార్చి 1: ఈనెల 8 నుంచి నెల్లూరు జిల్లా కావలిలో జరిగే 70వ రాష్ట్ర స్థాయి పురుషుల కబడ్డీ పోటీలలో పాల్గొనే విశాఖ జిల్లా జట్టును ఈ నెల 3న ఎంపిక చేయనున్నట్లు కబడ్డీ అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఉరుకూటి రాజేశ్వరి, అధ్యక్షుడు పి.కోటేశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఆదివారం మధ్యాహ్నం 2 గంటలకు గాజువాక హైస్కూల్ మైదానంలో పోటీలు నిర్వహిస్తామన్నారు. 85 కేజీలలోపు బరువున్న పురుషులు అర్హులని తెలిపారు. ఆసక్తి గల క్రీడాకారులు 76800 05666, 98856 98717 నంబర్లను సంప్రదించి పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు.

ఈ నెలలో 76 మంది ఉక్కు ఉద్యోగుల పదవీ విరమణ

ఉక్కుటౌన్ షిప్, మార్చి 1: స్టీల్‌ప్లాంట్‌లో విధులు నిర్వహిస్తున్న 76 మంది ఉద్యోగులు ఈ నెలలో పదవీ విరమణ చేయనున్నారు. ప్లాంట్‌లో ఏటా జూన్, జూలై నెలల్లో పదవీ విరమణలు ఎక్కువ. కానీ ఈ సారి మార్చిలో ఎక్కువ సంఖ్యలో ఉద్యోగులు పదవీ విరమణ చేస్తున్నారు. పరిశ్రమలో నెల నెల ఉద్యోగుల సంఖ్య తగ్గిపోతోంది.

నేడు అభివృద్ధి పనులకు శంకుస్థాపన

అగనంపూడి, మార్చి 1: జీవీఎంసీ 79 వార్డు పరిధిలోని పలు ప్రాంతాల్లో అభివృద్ధి పనులకు శనివారం శంకుస్థాపన చేయనున్నట్లు వార్డు కార్పొరేటర్ రౌతు శ్రీనివాస్ తెలిపారు. ఆల్ ఇండియా రేడియో స్టేషన్ వద్ద రూ.55 లక్షల వ్యయంతో బస్‌స్టేషన్, బీటీ రోడ్డు, గల్లవానిపాలెం వద్ద రూ 19.90 లక్షల వ్యయంతో సీసీ రోడ్డు నిర్మాణం, ప్రశాంతినగర్‌లో రూ 16 లక్షలతో రిటైనింగ్ వాల్ నిర్మాణానికి మేయర్ గొలగాని హరివెంకటకుమారి, ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి హాజరవుతారన్నారు. వార్డులోని నాయకులు, పెద్దలు హాజరు కావాలని ఆయన కోరారు.

నేడు టిడ్కో ఇళ్లు ప్రారంభం

మల్కాపురం, మార్చి 1: పశ్చిమ నియోజకవర్గ పరిధి 59వ వార్డు ములగాడ గ్రామంలో నిర్మించిన టిడ్కో ఇళ్లను ప్రారంభించేందుకు ఎట్టకేలకు ముహూర్తం ఖరారైంది. శనివారం ఈ ఇళ్లను ప్రారంభించి లబ్ధిదారులకు అందజేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు . అయితే, నాలుగున్నరేళ్లు వదిలేసి,ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో వైసీపీ ప్రభుత్వం ప్రజల నుంచి ఓట్లను రాబట్టేందుకు ఇప్పుడు హడావుడిగా టిడ్కో ఇళ్లను ప్రారంభించేందుకు ముహూర్తం ఖాయడం చేయడం విమర్శలు తలెతుతున్నాయి. రాజకీయ ప్రయోజనం కోసమేనంటూ ప్రతిపక్ష తెలుగుదేశం, జనసేన పార్టీలు ధ్వజమెత్తుతున్నాయి. ఈ ఇళ్లను టీడీపీ ప్రభుత్వ హయాంలో నిర్మించారు. వాటిని అర్హులకు అప్పగించే లోగా ఎన్నికలు రావడంతో ప్రక్రియకు బ్రేక్ పడింది. వైసీపీ అధికారంలోకి వచ్చిన తరువాత ఇళ్ల నిర్మాణాలను నిలిపివేసింది. ఆ తరువాత నెమ్మదిగా పనులు ప్రారంభించి పూర్తిచేయగలిగారు. అయితే, ఎన్నికల ముందు ఇళ్లను లబ్ధిదారులకు కేటాయించడం ఇది ఎన్నికల స్టంటేనని పలువురు భావిస్తున్నారు. ములగాడలో నిర్మించిన ఇళ్లను శనివారం ప్రారంభించనున్న నేపథ్యంలో స్థానిక వైసీపీ నాయకులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఇప్పటికే లబ్ధిదారులందరికీ ఇళ్ల ప్రారంభానికి సంబంధించి సమాచారమిచ్చారు.

బాధిత కుటుంబానికి పరిహారం

మల్కాపురం, మార్చి 1: హెచ్‌పీసీఎల్‌లో ఇటీవల ఆకస్మికంగా మృతి చెందిన ధనాల శంకర్ కుటుంబానికి సంబంధింత కాంట్రాక్టర్ రూ. 9.50 లక్షల నష్టపరిహారం చెల్లించేందుకు అంగీకరించారు. ఈ సొమ్మును రెండు, మూడు విడతలుగా ఇచ్చేందుకు సదరు కాంట్రాక్టర్ బాధిత కుటుంబంతో ఒప్పందం చేసుకున్నారు.

కమనీయం అప్పన్న నిత్య కల్యాణం

సింహాచలం, మార్చి 1 : వరాహలక్ష్మీనృసింహస్వామి ఆర్జిత నిత్య కల్యాణం శుక్రవారం కమనీయంగా సాగింది. వేకువజామున సుప్రభాతాది ప్రభాత సేవలు తరువాత ఉత్సవమూర్తి గోవిందరాజస్వామిని ఉభయ దేవేరులతో ప్రత్యేక వేదికపై అధిష్టింపజేశారు. ప్రత్యక్షంగా పాల్గొన్న భక్తుల గోత్రనామాలతో అర్చకులు సంకల్పించి, పాంచరాత్రాగమశాస్త్ర విధానంలో కల్యాణ క్రతువు నిర్వహించారు.

సినిమా గైడ్

- **చారి 111 :** వెంకటేశ్వర-2, కిన్నెర, శ్రీలక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), సుకన్య (గోపాలపట్నం), మినీ మోహిని (గాజువాక).
- **భూతద్దం భాస్కరనారాయణ :** శారద, శరత్, ఊర్వశి (కంచరపాలెం) సౌజన్య (గోపాలపట్నం), లక్ష్మి (గాజువాక), నటరాజ్ (పెందుర్తి).
- **ఇంటి నెం.13 :** లీలామహల్.
- **మా ఊరి రాజారెడ్డి :** క్రాంతి
- **రాధా మాధవం :** మౌర్య (గోపాలపట్నం)
- **భ్రమయుగం :** జగదాంబ, హెవెన్ (గాజువాక), గణేష్ (తగరపువలస)
- **సుందరం మాస్టర్ :** శ్రీలక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), సప్తగిరి (తగరపువలస)
- **సిద్ధార్థ్ రాయ్ :** శ్రీరామ, శ్రీకన్య, మోహిని (గాజువాక), అరుణ (పెదగంట్యాడ)
- **ఊరు పేరు భైరవకోన :** మెలోడి, సంగం, కామేశ్వరి, గోకుల్ ఊర్వశి, నరసింహ (గోపాలపట్నం), కన్య-2 (గాజువాక), సీతారామయ్య (పరవాడ), తాతా (తగరపువలస)
- **ఈగల్ :** రమాదేవి,
- **హనుమాన్ :** శ్రీవెంకటేశ్వర, నరసింహ (గోపాలపట్నం), రాములమ్మ (తగరపువలస)

రైతు బజార్‌లో ధరలు (కిలో/ రూ.ల్లో)

ఉల్లిపాయలు 27, టమాటా 18, వంకాయలు (తెలుపు) 24, వంకాయలు (నలుపు) 54, బెండకాయలు 32, పచ్చిమిర్చి 32, కాకరకాయలు 40, బీరకాయలు 36, ఆనపకాయ 18, కాలీఫ్లవర్ 30, క్యాబేజి 20, క్యారెట్ 28, దొండకాయలు 28, బంగాళదుంపలు 20, అరటికాయ (పె)7, మునక్కాడలు (కిలో) 65, అల్లం (పాతది) 100, బరబాటి 24, ముల్లంగి 20, నిమ్మకాయలు (కిలో) 110, గోరుచిక్కుడు 32, దోసకాయలు 30, వెల్లుల్లి (పెద్దవి) 180, కొబ్బరికాయ (పెద్దది) 22, బీన్స్ (పెన్సిల్) 46, ఆగాకర 52, పొటల్స్ 62, కీరదోస 30, కాప్సికమ్ 54, పొట్లకాయ (పెద్దది) 20, చేమదుంపలు 48, చిలగడదుంపలు 26, కంద 64, దేముడు చిక్కుడు 46, కొండఉసిరి 65, కరివేపాకు (కిలో) 50, కొత్తిమీర (పెద్దకట్ట) 20, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 3, పాలకూర (కట్ట) 3, తోటకూర (కట్ట) 3, మామిడికాయలు 70, బూడిద గుమ్మడికాయ 26, కర్రపెండలం 24, మామిడి అల్లం 70, బొప్పాయి 34, జామకాయలు (కిలో) 55.

కోడిగుడ్లు (నెక్)

(వంద - రూ.లలో)

విశాఖపట్నం	500
విజయనగరం	504
శ్రీకాకుళం	504

చికెన్ ధరలు

బ్యాగ్

రైతు ధర	-- 120
ఫారం ధర	-- 140
విత్ స్కిన్	-- 250
స్కిన్‌లెస్	-- 260

మరికొన్ని సిటీ వార్తలు పేజీ 9లో..

ఉక్కు పరిరక్షణకు పాదయాత్ర రేపు

- స్టీల్‌ప్లాంట్ ఆర్చ్ నుంచి ప్రారంభం
- జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద ముగింపు



పాదయాత్ర పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న పోరాట కమిటీ నాయకులు

ఉక్కుటౌన్‌షిప్, మార్చి 1: స్టీల్‌ప్లాంట్ పరిరక్షణకు ఆదివారం ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ ఆధ్వర్యంలో మహా పాదయాత్ర చేపట్టనున్నారు. ఈ నెలలో ప్రధాన మంత్రి నరేంద్రమోదీ విశాఖ పర్యటన ఉందనే సమాచారంతో గత నెల 27న పాదయాత్ర చేపట్టాలని ఉక్కు పరిరక్షణ కమిటీ నిర్ణయించింది. అయితే ప్రధాని పర్యటన వాయిదా పడిన నేపథ్యంలో పాదయాత్రను ఈ నెల 3వ తేదికి వాయిదా వేశారు. స్టీల్‌ప్లాంట్ రిలే నిరాహార దీక్ష శిబిరం వద్ద ప్రారంభమయ్యే పాదయాత్ర జీవీఎంసీ గాంధీ విగ్రహం వరకు సాగుతుందని నిర్వాహకులు తెలిపారు. స్టీల్‌ప్లాంట్‌ను ప్రైవేటీకరించేందుకు 2021 జనవరి 27న కేంద్ర ప్రభుత్వం నిర్ణయించింది. దీంతో ఉక్కు కార్మిక సంఘాలు, అధికారుల సంఘం, వివిధ అసోసియేషన్‌లు ఏకమై ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీగా ఏర్పడి పోరాటాలు ప్రారంభించారు. 2021 ఫిబ్రవరి 12న స్టీల్‌ప్లాంట్ ఆర్చ్ వద్ద రిలే నిరాహారదీక్షలు ప్రారంభించారు. అప్పటి నుంచి నిరాటంకంగా వివిధ రూపాల్లో ప్లాంట్ పరిరక్షణకు ఉద్యమాలు సాగుతున్నాయి. ఈ ఉద్యమాన్ని విశాఖకే పరిమితం చేయకుండా రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో పర్యటించి సభలు నిర్వహిస్తున్నారు. 32 మంది ప్రాణత్యాగ ఫలితం, ఉక్కు నిర్వాసితుల భూత్యాగంతో నిర్మితమైన స్టీల్‌ప్లాంట్‌ను ప్రభుత్వ రంగంలోనే కొనసాగించాలని, ప్రైవేటీకరణ నిర్ణయాన్ని కేంద్రం విరమించుకోవాలని, స్టీల్‌ప్లాంట్ ప్రభుత్వ రంగంలోనే కొనసాగుతుందని ప్రకటన చేయాలని ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ డిమాండ్ చేస్తోంది.

పాదయాత్ర సాగేదిలా...

ఉక్కు పరిరక్షణ పాదయాత్ర ఆదివారం ఉదయం 8గంటలకు స్టీల్‌ప్లాంట్ రిలే నిరాహారదీక్ష శిబిరం వద్ద ప్రారంభం కానుంది. అక్కడి నుంచి శ్రీనగర్, పాతగాజువాక, బీహెచ్‌పీవీ, షీలానగర్, ఎయిర్‌పోర్టు, ఎన్ఏడీ, 104, దొండపర్తి మీదుగా జీవీఎంసీ గాంధీ విగ్రహం వరకు సాగుతుంది.

బాక్సింగ్ చాంపియన్ షిప్ పోటీలు ప్రారంభం



బాక్సింగ్ పోటీలు ప్రారంభిస్తున్న టీడీపీ నాయకుడు శ్రీభరత్, ఎమ్మెల్యే గణబాబు

గోపాలపట్నం, మార్చి 1: క్రీడలతో యువతకు ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని టీడీపీ నాయకుడు, గీతం విద్యా సంస్థల అధినేత ఎం.శ్రీభరత్ అన్నారు. యంగ్ ఫ్రెండ్స్ బాక్సింగ్ క్లబ్ ఆధ్వర్యంలో స్థానిక బంక్ కూడలిలో మూడు రోజుల పాటు జరగనున్న సబ్ జూనియర్ బాయ్స్ అండ్ గర్ల్స్ స్టేట్ బాక్సింగ్ చాంపియన్ షిప్ పోటీలను శుక్రవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించడం ద్వారా మెరుగైన అవకాశాలు లభిస్తాయన్నారు. పశ్చిమ ఎమ్మెల్యే గణబాబు మాట్లాడుతూ రాష్ట్రస్థాయి పోటీలు ఈ ప్రాంతంలో నిర్వహించడం ఆనందంగా ఉందని, క్రీడాకారులు సద్వినియోగం చేసుకుని జాతీయ స్థాయిలో రాణించాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా నిర్వాహకుల్ని అభినందించారు. కార్యక్రమంలో బాలాజీ విద్యా సంస్థల అధినేత మండవ రవికుమార్, ఏపీ బాక్సింగ్ అసోసియేషన్ కార్యదర్శి బి.లక్ష్మణదేవ్, అసోసియేషన్ సభ్యులు, నిర్వాహకులు పాల్గొన్నారు.

మౌలిక వసతుల కల్పనే ధ్యేయం: మేయర్

గాజువాక, మార్చి 1: నగర ప్రజలకు పూర్తిస్థాయి మౌలిక సదుపాయాలు కల్పనే ధ్యేయమని మేయర్ గొలగాని హరి వెంకటకుమారి అన్నారు. జీవీఎంసీ 72వ వార్డులో పలు అభివృద్ధి పనులకు మేయర్, ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ.. వార్డుల్లో కోట్లాది రూపాయలు వెచ్చించి పనులు చేపడుతున్నామన్నారు. ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు స్టాలిన్, సుజాత, గాజువాక వైసీపీ ఇన్‌చార్జి ఉరుకూటి చందు, నాయకుల వాసు, మంత్రి శంకర్‌నారాయణ, ప్రసాద్, రాంరెడ్డి పాల్గొన్నారు.



శిలాఫలకం ఆవిష్కరిస్తున్న ఆడారి ఆనంద్‌కుమార్

సామాజిక భవనం ప్రారంభం

ఎన్.ఎ.డీ జంక్షన్: బుచ్చిరాజుపాలెం గవ రవీధిలో రూ.15.17లక్షలతో నిర్మించిన గౌరీ సామాజిక భవనం అదనపు అంతస్తును వైసీపీ పశ్చిమ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆడారి ఆనందకుమార్ శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో దశలవారీగా మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్ బొమ్మిడి రమణ, నాయకులు చుక్కా ప్రసాద్‌రెడ్డి, నమ్మి శ్రీను, దొడ్డి కిరణ్, సతీష్, ఎల్లపు వెంకటేశ్వరరావు, అప్పలరెడ్డి పాల్గొన్నారు.




అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న మేయర్

కనకమహాలక్ష్మికి వైభవంగా క్షీరాభిషేకం



అలంకరణలో కనకమహాలక్ష్మి



పరదేశమ్మ ఆలయ వార్షికోత్సవం సందర్భంగా పూజల్లో పాల్గొన్న భక్తులు



దుర్గమాంబకు అలంకరణ

ఎన్.ఎ.డీ జంక్షన్ మార్చి 1: జీవీఎంసీ 90వ వార్డు పరిధిలోని కాకానీనగర్ దరి కనకమహాలక్ష్మీనగర్‌లోని కనకమహాలక్ష్మి ఆలయంలోని అమ్మవారికి శుక్రవారం 108 కలశాలతో ప్రత్యేక పాలాభిషేకం చేశారు. ముందుగా భక్తులు ఊరేగింపు నిర్వహించారు. అనంతరం మధ్యాహ్నం భారీ అన్నసమారాధన చేపట్టారు. ఈ కార్యక్రమంలో డీటీ నాయుడు, కృష్ణంరాజు, పెద్దినాయుడు, రాంప్రసాద్; సోమేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

దుర్గమాంబకు పూజలు

అగనంపూడి: అగనంపూడి కూడలికి సమీపంలోని దుర్గమాంబ ఆలయంలో మాఘ శుక్రవారం పురస్కరించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈసందర్భంగా నిర్వాహకులు అమ్మవారిని పూలతో అలంకరించారు. పరసర గ్రామాల భక్తులు పసుపు, కుంకుమలు, చీరలు సమర్పించి మొక్కలు తీర్చుకున్నారు. బొర్రమాంబ పారాయణ సేవా సమితి మహిళలు ఆలయంలో లలితా పారాయణం, విష్ణుసహస్ర పారాయణాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ చిత్తా గణేష్, పారాయణ సేవా సమితి ఆర్గనైజర్ చిత్తా రామారావు, తదితరులు పాల్గొన్నారు.

నేడు వెంకన్న ఆలయానికి భూమిపూజ

ఎన్.ఎ.డీ జంక్షన్: జీవీఎంసీ 90వ వార్డు పరిధి ఏపీఎస్ఈబీ కాలనీలో సింహగిరి వెంకటేశ్వరస్వామి ఆలయ నిర్మాణానికి శనివారం భూమిపూజ నిర్వహించనున్నట్టు ఆలయ కమిటీ సభ్యులు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి రాజ్యసభ సభ్యుడు వై.వి.సుబ్బారెడ్డి, దేవదాయ శాఖా మంత్రి కె.సత్యనారాయణ, కమిషనర్ ఎస్.సత్యనారాయణ, సింహాచలం ఈఓ ఎస్.శ్రీనివాసమూర్తి తదితరులు హాజరవుతారని తెలిపారు.

ఘనంగా పరదేశమ్మ ఆలయ వార్షికోత్సవం

పెదగంట్యాడ: జీవీఎంసీ 76వ వార్డు పరిధి స్వతంత్రనగర్ గ్రామదేవత పరదేశమ్మ ఆలయ వార్షికోత్సవాలు శుక్రవారం ఘనంగా జరిగాయి. ఉదయం నుంచి అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు జరిగాయి. అనంతరం అమ్మవారికి ప్రత్యేక అలంకరణ చేశారు. స్వతంత్రనగర్, నడుపూరు గ్రామాలకు చెందిన మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని పూజలు చేశారు. గాజువాక వైసీపీ ఇన్‌చార్జి ఉరుకూటి రామచంద్రరావు, దొడ్డి రమణ, తదితరులు పాల్గొన్నారు.

అసంపూర్తిగా నిలిచిపోయిన సామాజిక భవన నిర్మాణం

మల్కాపురం, మార్చి 1: గ్రేటర్ 58వ వార్డు కుంచమ్మ కాలనీ కార్పొరేటర్ గులిగిందల లావణ్య ఇంటికి కూత వేటు దూరంలో ఉన్న రజకుల సామాజిక భవనం ఏళ్ల తరబడి అసంపూర్తిగా నిలిచిపోయింది. వార్డులో ఆమె ఆధ్వర్యంలో కోట్లాది రూపాయలతో అభివృద్ధి పనులు చేపట్టినా ఈ సామాజిక భవనం పూర్తి చేయడంలో విఫలం కావడంపై విమర్శలు వెల్లువెత్తున్నాయి. గతంలో రజకులు శుభకార్యక్రమాలు, ఇతర వేడుకలను పాత భవనం నిర్వహించేవారు. ఈ స్థితిలో కొత్త భవనం నిర్మాణానికి నిధులు మంజూరు చేశారు. ఈ భవనంతోపాటు ములగాడ గ్రామంలో ప్రారంభించిన ఇతర సామాజిక భవనాలు పూర్తయ్యాయి. కానీ కార్పొరేటర్ ఇంటికి అతిసమీపంలో ఉన్న రజకుల సామాజిక భవనం నిర్మాణం పూర్తికాలేదు. ఈ స్థితిలో పశ్చిమ నియోజకవర్గ వైసీపీ నేత ఆడారి ఆనంద్‌కుమార్, జీవీఎంసీ ఉన్నతాధికారులు స్పందించి ఈభవనం త్వరతగతిన పూర్తయ్యేలా చూడాలని పలువురు కోరుతున్నారు.



పనులు సగంలో నిలిపివేసిన సామాజిక భవనం

ప్రశాంత వాతావరణంలో ఇంటర్ పరీక్షలు ప్రారంభం

కూర్మన్నపాలెం, మార్చి 1: ఇంటర్ ప్రథమ సంవత్సర పరీక్షలు శుక్రవారం ప్రారంభమయ్యాయి. జీవీఎంసీ 86వ వార్డు కూర్మన్నపాలెం నారాయణ కళాశాలలో 477 మంది విద్యార్థులు హాజరుకావాల్సి ఉండగా, 471 మంది విద్యార్థులు హాజరయ్యారు. ఆరుగురు హాజరు కాలేదు. అన్ని కేంద్రాల వద్ద 144 సెక్షన్‌ను అమలు చేశారు. పారిశ్రామిక ప్రాంతంలో పరీక్ష కేంద్రాల వద్ద ఉదయం ఎనిమిది గంటల నుంచి హడావుడి వాతావరణం నెలకొంది. తల్లిదండ్రులు విద్యార్థులను తీసుకుని పరీక్ష కేంద్రాలకు చేరుకున్నారు. కొందరు సమీపంలో ఉన్న ఆలయాలకు వెళ్లి పూజలు నిర్వహించి పరీక్ష కేంద్రాలకు వచ్చారు. నిబంధన మేరకు ఉదయం ఎనిమిదికి ముందుగానే కేంద్రాలకు చేరుకున్నారు. అనంతరం ఉదయం 8:30 గంటలకు లోపలికి అనుమతించారు.పరీక్ష కేంద్రాల్లో తాగునీరు, ఫ్యాన్‌లు, వెలుతురు సక్రమంగా ఉండేలా ముందస్తు జాగ్రత్తలు చేపట్టారు.



కూర్మన్నపాలెంలో పరీక్ష కేంద్రం వద్ద రద్దీ

శ్రీనగర్ శ్రీకృష్ణా కళాశాలలో 416 మంది విద్యార్థులు పరీక్ష రాయాల్సి ఉండగా, 8 మంది రాలేదు. పలువురు తల్లి దండ్రులు కార్లు, ద్విచక్ర వాహనాలపై పలుచోట్ల ట్రాఫిక్ జామ్ నెలకొంది. కొందరు విద్యార్థులు మార్గమధ్యలో దిగి నడచివెళ్లాల్సి వచ్చింది. శనివారం నుంచైనా, ప్రధాన కూడళ్లలో ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తకుండా పోలీసులు ప్రత్యేక దృష్టి సారించాలని పలువురు కోరుతున్నారు.

పెందుర్తిలో...

పెందుర్తి; పెందుర్తి సమీపాన ఆర్ఆర్‌వీ పురం ఆళ్వార్‌దాస్, మేహాద్రి బాలికల గురుకుల పాఠశాల, పెందుర్తి ప్రభుత్వ జూనియర్ కళాశాల, శ్రీ నవోదయ, బాలాజీ, రాజయ్యపేట డీఆర్ కళాశాలల్లో ఇంటర్ పరీక్షలు ప్రారంభమయ్యాయి. ఈ ఆరు కేంద్రాల్లో 2,814 మంది విద్యార్థులు పరీక్షకు హాజరయ్యారని అధికారులు తెలిపారు. పెందుర్తి జూనియర్ కళాశాలలో విద్యార్థులకు ఎటువంటి అసౌకర్యం తలెత్తకుండా వసతులు కల్పించినట్టు ప్రిన్స్‌పాల్ శరగడం శ్రీనివాసరావు తెలిపారు.



పెందుర్తి కళాశాల వద్ద విద్యార్థుల సందడి

ఉక్కు ఉద్యమానికి టీడీపీ సంపూర్ణ మద్దతు

- పార్టీ జిల్లా అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు



సమావేశంలో మాట్లాడుతున్న పల్లా శ్రీనివాసరావు

గాజువాక, మార్చి 1: తెలుగు రాష్ట్రాలకే మణిహారంగా నిలిచిన స్టీల్‌ప్లాంట్‌ను ముఖ్యమంత్రి జగన్‌రెడ్డి తన స్వప్రయోజనాల కోసం కేంద్రానికి తాకట్టు పెట్టారని టీడీపీ జిల్లా అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు విమర్శించారు. ఈ మేరకు శుక్రవారం గాజువాక పార్టీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ స్టీల్‌ప్లాంట్ పరిరక్షణలో భాగంగా ఆదివారం చేపట్టనున్న పాదయాత్రకు తెలుగుదేశం పార్టీ సంపూర్ణ మద్దతు తెలుపుతుందన్నారు. స్టీల్‌ప్లాంట్ ఉద్యమానికి నాయకత్వం వహించాల్సిన ముఖ్యమంత్రి పట్టనట్లు వ్యవహరిస్తున్నారన్నారు. దుర్మార్గ ప్రభుత్వానికి సమాధి కట్టేందుకు రాష్ట్ర ప్రజలంతా సిద్ధంగా ఉన్నారన్నారు. స్టీల్‌ప్లాంట్ పరిరక్షణకు తెలుగుదేశం పార్టీ ఆదినుంచీ పోరాటాలు చేస్తోందన్నారు. సమావేశంలో పార్టీ నాయకులు ప్రసాదుల శ్రీనివాస్, నమ్మి సింహాద్రి, పెద్దాడ సోమినాయుడు, వియ్యపు అప్పలనాయుడు, మొల్లి చిన్నోడు, గుమ్మడి నరేంద్ర తదితరులు పాల్గొన్నారు.

కన్నీళ్లతో ఉక్కు ఉద్యోగి పదవీ విరమణ



ప్లాంట్ గేటు వద్ద నమస్కరిస్తున్న ఉద్యోగి

ఉక్కుటౌన్‌షిప్, మార్చి 1: అతను స్టీల్‌ప్లాంట్ ఉద్యోగి. రిటైర్‌మెంట్ సందర్భంగా 34 ఏళ్ల పాటు పనిచేసిన కర్మాగారాన్ని వదిలి వెళ్లటానికి అతని మనసు అంగీకరించలేదు. తనకు, తన కుటుంబానికి మంచి జీవితాన్ని ఇచ్చిన కర్మాగారం రుణం తీర్చుకోలేనిదని వెక్కివెక్కి ఏడ్చారు. ఎస్ఎంఎస్ విభాగంలో సూరపనేని శ్రీనివాసరావు 34 సంవత్సరాల పాటు పనిచేశారు. ఇతను గురువారం ఉద్యోగ విరమణ చేశారు. ఇన్నాళ్లూ పనిచేసిన పరిశ్రమను వదిలి వెళ్లలేక శుక్రవారం ఉదయం భార్యతో కలిసి ప్లాంట్ ప్రధాన గేటు వద్దకు వచ్చి సాష్టాంగ నమస్కారం చేసి కన్నీళ్లతో వెనుదిరిగారు.

చిత్రలేఖనంలో కణితి విద్యార్థుల ప్రతిభ



బహుమతులు పొందిన విద్యార్థులతో కణితి పాఠశాల ఉపాధ్యాయులు

కూర్మన్నపాలెం, మార్చి 1: కృషి, పట్టుదల ఉంటే విద్యార్థులు ఏ రంగంలోనైనా రాణించవచ్చునని కణితి జీవీఎంసీ హైస్కూలు ప్రధానోపాధ్యాయుడు బి.సూర్య ప్రకాశ్ అన్నారు. పాఠశాలలో శుక్రవారం విద్యార్థులకు ధ్వని, శబ్ద, వాయు కాలుష్యంపై చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో చిత్రలేఖనం ఉపాధ్యాయుడు బీవీడీ నాయుడు, ఉపాధ్యాయులు అరుణ, సూకరత్నం, భారతి,ప్రసూనాంబ, మన్నాజీ, ప్రసాద్, అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

పల్స్ పోలియోను విజయవంతం చేయాలి

గాజువాక, మార్చి 1: పల్స్‌పోలియో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని గాజువాక జోనల్ ఎంఓహెచ్ కిరణ్‌కుమార్ పేర్కొన్నారు. ఈ నెల 3న జరగనున్న పల్స్‌పోలియో కార్యక్రమం నేపథ్యంలో జోనల్‌కార్యాలయంలో ప్రభుత్వ ఆస్పత్రుల వైద్యాధికారులు సంబంధిత సిబ్బందితో శుక్రవారం ఆయన సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన పలు సూచనలు చేశారు. ప్రతీ ప్రభుత్వ ఆస్పత్రి పరిధిలో ఏయే ప్రాంతాల్లో కేంద్రాలు ఏర్పాటు చేయాలన్నది గుర్తించాలన్నారు. పోలియో కేంద్రాలకు పిల్లలను తీసుకొచ్చే లా తల్లితండ్రుల్లో అవగాహన కల్పించాలన్నారు. 0 నుంచి 5 ఏళ్ల చిన్నారులందరికీ పోలియో చుక్కలు వేయాలన్నారు. ఈ సమీక్షలో జోనల్ పరిధిలో ఉన్న ప్రభుత్వ ఆస్పత్రి వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

'శిష్టకరణాల హక్కుల సాధనకు సమష్టి కృషి'

కూర్మన్నపాలెం, మార్చి 1: శిష్టకరణాలు సమష్టిగా హక్కులను సాధించుకోవాలని రాష్ట్ర శిష్టకరణాల అసోసియేషన్ కార్యదర్శి చంద్రమౌళి పిలుపునిచ్చారు. జీవీఎంసీ 86వ వార్డు వడ్లపూడి దరి సంతమామిడి తోటలో శుక్రవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో ఎంతో మంది శిష్టకరణాలు ఆర్థికంగా ఇబ్బంది ఎదుర్కొంటున్నారన్నా రు. త్వరలో తమ సామాజిక వర్గాన్ని ఓబీసీలో చేర్చేలా ప్రభుత్వాలపై ఒత్తిడి తీ సుకు వస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో కూర్మన్నపాలెం అసోసియేషన్ అధ్యక్షులు గంగవరం గోపి, కార్యదర్శి డి.సత్యారావు పాత్రో, ప్రసాద్, భాస్కర్, రమేష్, హరనాథ్, కృష్ణారావు, మూర్తి, ఉమా మహేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

పదో తరగతి పరీక్షల సన్నద్ధతపై డీఈవో ఆరా



వేపగుంటలో విద్యార్థులతో మాట్లాడుతున్న డీఈఓ చంద్రకళ

వేపగుంట మార్చి 1: వేపగుంట హైస్కూల్‌ను డీఈవో చంద్రకళ శుక్రవారం సందర్శించారు. పదో తరగతి విద్యార్థులు పరీక్షల సన్నద్ధతపై ఆరా తీశారు ఈ పాఠశాలలో ఈ ఏడాది 146మంది విద్యార్థులు పదోతరగతి పరీక్షకు హాజరుకానున్నారు. వీరికి అం దుతున్న బోధనను అడిగి తెలుసుకున్నారు. ఆత్మస్థైర్యంలో పరీక్ష రాయాలని సూచించా రు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు పద్మావతి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

గురుకులంలో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

భీమునిపట్నం, మార్చి 1: గురుకుల పాఠశాలలు, జూనియరు, డిగ్రీ కళాశాలలో వచ్చే విద్యాసంవత్సరానికి సంబంధించి ప్రవేశాలకు ప్రభుత్వం నోటిఫికేషన్ విడుదల చేసిందని భీమిలి ఏపీ గురుకుల బాలికల పాఠశాల ప్రిన్సిపాల్, జిల్లా కోఆర్డినేటర్ కోడి రాంబాబు తెలిపారు. గురుకుల పాఠశాలల్లో 5వ తరగతిలో ప్రవేశానికి, 6,7,8 తరగతుల్లో మిగులు సీట్ల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నారన్నారు. ఏపీఆర్‌జేసీ సెట్ ద్వారా ఏడు గురుకుల జూనియరు కళాశాలలు నాగార్జునసాగర్ వద్ద ఉన్న డిగ్రీ కళాశాలలో మొదటి సంవత్సరం ప్రవేశాలకు కూడా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఆసక్తి గల వారు హెచ్‌టిటిపిఎస్://ఏపిఆర్ఎస్.ఏపిసిఎఫ్ఎస్ఎస్.ఐఎన్ ద్వారా ఆన్‌లైన్‌లో మాత్రమే దరఖాస్తు చేసుకోవాలని చెప్పారు. ఈనెలాఖరు వరకూ గడువు ఉందన్నారు.

జోరుగా ఇంకుడు గుంతల తవ్వకాలు

కూర్మన్నపాలెం, మార్చి 1: జీవీఎంసీ 87వ వార్డు తిరుమల నగర్‌లో శుక్రవారం కాలనీ అసోసియేషన్ ఆధ్వర్యంలో కాలనీలో ఇంకుడు గుంతలు తవ్వకాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా అసోసియేషన్ కార్యదర్శి విశ్వేశ్వరరావు మాట్లాడుతూ, రానున్న వేసవి నేపథ్యంలో తాగునీటి సమస్య తలెత్తకుండా కాలనీలో భూగర్భ జలాల పెంపునకు వీలుగా ఇంకుడు గుంతలు కార్యక్రమంను నిర్వహిస్తున్నామన్నారు. ఈకార్యక్రమంలో నాగభూషణం, పరమేశ్వరరావు, పరమానందం, సన్యాసిరావు, వసంత రెడ్డి, మూర్తి తదితరులు పాల్గొన్నారు.

విశాఖ దక్షిణ టికెట్ గండి బాబ్జీకే ఇవ్వాలి

» టీడీపీ అధిష్టానానికి నాయకులు అభ్యర్థన

విశాఖపట్నం, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): విశాఖ దక్షిణ నియోజకవర్గ టికెట్ తెలుగుదేశం అభ్యర్థిగా గండి బాబ్జీని అధిష్టానం ప్రకటించాలని ఆ పార్టీ నాయకులు కోరారు. శుక్రవారం జిల్లాపరిషత్ సమీపంలో ఓ కల్యాణమండపంలో నియోజకవర్గ పరిధిలో ముఖ్యనాయకులు, వార్డు అధ్యక్షులు తదితరులు సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ముఖ్యనేతలు మాట్లాడుతూ ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో బాబ్జీ ఎంపిక విషయం అధిష్టానం స్పష్టత ఇవ్వాలని కోరారు. అనంతరం వీరంతా పార్టీ విశాఖ పార్లమెంటు ఇన్‌చార్జి ఎం.శ్రీభరత్‌ను ఆయన స్వగృహంలో కలిసి బాబ్జీకి టికెట్ కేటాయించాలని అభ్యర్థించారు. ఈ విషయం అధిష్టానం దృష్టికి తీసుకువెళతానని శ్రీభరత్ హామీ ఇచ్చారు.

పీసీబీ జాయింట్ చీఫ్ ఇంజనీరుగా రమేష్

విశాఖ ఈఈ నాగిరెడ్డికి ఎస్ఈగా పదోన్నతి

విశాఖపట్నం, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): కాలుష్య నియంత్రణ మండలి విశాఖ జోన్ కార్యాలయం జాయింట్ చీఫ్ ఇంజనీరుగా కె.రమేష్‌ను నియమించారు. ప్రధాన కార్యాలయంలో ఎస్ఈగా పనిచేస్తున్న రమేష్‌కు జోనల్ కార్యాలయంలో పోస్టింగ్ ఇచ్చారు. ఇప్పటివరకు విశాఖ జాయింట్ చీఫ్ ఇంజనీరుగా అదనపు బాధ్యతలు నిర్వహిస్తున్న ప్రసాదరావుకు పదోన్నతి కల్పించి విజయవాడ ప్రధాన కార్యాలయంలో పోస్టింగ్ ఇచ్చారు. ప్రాంతీయ కార్యాలయంలోని ఈఈ నాగిరెడ్డికి ఎస్ఈగా పదోన్నతి కల్పించిన బోర్డు పోస్టింగ్ ఇవ్వలేదు. రాష్ట్రంలో ఏఈలుగా పనిచేస్తున్న మరో తొమ్మిదిమందికి ఈఈలుగా పదోన్నతి కల్పించారు. విశాఖ ప్రాంతీయ కార్యాలయంలో పనిచేస్తున్న ఏఈ పి.శ్రీనివాసరావుకు పదోన్నతి లభించింది.

ఘనంగా హజ్రత్ ఖాజా చందనోత్సవం

మర్రిపాలెం, మార్చి 1: మర్రి పా లెం జాకీరు హౌ స్సేన్‌నగర్ మజీద్ ఈ అల్ ఖదీర్ ఆధ్వ ర్యంలో హజ్రత్ ఖాజా గరీబ్ నవాజ్ చందనోత్సవం శుక్రవారం ఘనంగా నిర్వ హించారు. వేడుకల్లో భాగంగా పవిత్ర నమా జు ఆచరించిన ముస్లింలు మజీద్ ప్రాంగణంలో ఖురాన్ పఠించారు. అనంతరం మర్రి పాలెం, గ్రీన్‌గార్డెన్స్, పార్వతినగర్‌లో తదితర ప్రాంతాల్లో చాదర్ (పవిత్ర వస్త్రం)తో ర్యాలీ నిర్వహించి నిషానివద్ద ఫతేహా నిర్వహించారు. వైసీపీ కన్వీనర్ కేకే రాజు, బర్కత్‌అలీ చాదర్‌ను దర్శించుకున్నారు.మజీద్ కమిటీ అధ్యక్షుడుమున్నా, ఉర్స్ కమిటీ సభ్యులు పర్యవేక్షించారు.

ఆర్టీసీకి పెరిగిన ఆదాయం

ద్వారకాబస్‌స్టేషన్, మార్చి 1: బస్సుల సగటు ఆక్యుపెన్సీ రేషియో, రోజువారీ ఆదాయం పెరగడంతో ఆర్టీసీ అధికారులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. హైదరాబాద్, విజయవాడ, తిరుపతి, రాజమండ్రి, కాకినాడ సర్వీసులకు కూడా రిజర్వేషన్‌పూర్తికావడంతో సంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. మధురవాడ, విశాఖపట్నం, మద్దిలపాలెం, వాల్తేరు, సింహాచలం, గాజువాక, స్టీల్ సిటీ డిపోల పరిధిలోని 760 బస్సులు ఫిబ్రవరిలో రోజుకు సగటున 2.9 లక్షల కిలోమీటర్లు తిరిగి రూ.కోటి చొప్పున ఆదాయం సమకూర్చాయి. సగటు ఆక్యుపెన్సీ రేషియో 63 శాతంగా నమోదయింది., జనవరిలో రోజువారీ ఆదాయం రూ.95 లక్షలు, ఓఆర్ 58 శాతం నమోదైంది. మాఘమాసం కావడం శుభ ము హూర్తాలతో ప్రయాణికుల రాకపోకలు పెరిగాయని అధికారులు చెబుతున్నారు.

ఎన్‌సీసీ శిక్షణకు కేడెట్స్ ఎంపిక

అక్కయ్యపాలెం, మార్చి 1 : ఎన్‌జీజీఓస్ కాలనీలోని జీవీఎంసీ ఉన్నత పాఠశాలలో శుక్రవారం ఎన్‌సీసీ ఆర్మీ శిక్షణకు ఎంపిక జరిగింది. పాఠశాల ఎన్‌సీసీ ప్రథమ శ్రేణి ఉన్నతాధికారి ఎంఎస్‌వీ విశ్వనాథం ఆధ్వర్యంలో 2024-26లకు గాను ప్రవేశాలు జరిగాయి. పాఠశాలలోని 7, 8 తరగతి చదువుతున్న సుమారు 200 మంది విద్యార్థులకు దేహదారుఢ్య పరీక్షలు నిర్వహించగా 14 మంది బాలికలు జూనియర్ వింగ్‌గా, 10 మంది బాలురు జూనియర్ డివిజన్‌గా ఎంపికయ్యారు. హెచ్‌ఎం బి.లక్ష్మీనరస, కమాండింగ్ అధికారి కల్నల్ అజయ్ కుమార్,సుబేదార్ మేజర్ సజీవన్ కేకే, హవల్దార్లు శుక్ర, శ్యామల, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

భువనేశ్వరికి ఆత్మీయ వీడ్కోలు



విమానాశ్రయంలో భువనేశ్వరికి వీడ్కోలు పలుకుతున్న తెలుగుదేశం పార్టీ నాయకులు

గోపాలపట్నం, మార్చి 1: ఉత్తరాంధ్ర జిల్లాల్లో జరిగిన నిజం గెలవాలి కార్యక్రమంలో పాల్గొని తిరుగు ప్రయాణమైన తెలుగుదేశం పార్టీ అధినేత నారా చంద్రబాబు నాయుడు సతీమణి నారా భువనేశ్వరికి పార్టీ శ్రేణులు ఆత్మీయ వీడ్కోలు పలికారు. శుక్రవారం మధ్యాహ్నం విమానాశ్రయానికి చేరుకున్న ఆమెకు అనకాపల్లి పార్లమెంట్ నియోజకవర్గ ఇన్‌చార్జి బుద్ధా నాగజగదీశ్, చోడవరం ఇన్‌చార్జి బత్తుల తాతయ్యబాబు, ఎలమంచిలి ఇన్‌చార్జి ప్రగడ నాగేశ్వరావు తదితరులు వీడ్కోలు పలికారు. అనంతరం ఆమె చెన్నై బయలుదేరి వెళ్లారు.

పోలింగ్ కేంద్రాల్లో మౌలిక వసతుల కల్పన: కలెక్టర్

మహారాణిపేట, మార్చి 1: జిల్లా వ్యాప్తంగా పోలింగ్ కేంద్రాల్లో మౌలిక వసతుల కల్పనకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్టు కలెక్టర్ ఏ మల్లికార్జున పేర్కొన్నారు. శుక్రవారం రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి ముఖేశ్ కుమార్ మీనా విజయవాడ నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా వివిధ జిల్లాల కలెక్టర్లతో మాట్లాడారు. ఈ సమావేశంలో జిల్లా కలెక్టర్ మల్లికార్జున మాట్లాడుతూ వికలాంగుల సౌకర్యార్థం కేంద్రాల్లో ర్యాం పులు వేశామని, అలాగే, తాగునీరు, గదుల్లో విద్యుత్ సంబంధిత ఏర్పాట్లు చేసినట్టు వివరించారు.

దుర్గాలమ్మ జాతరకు పందిరిరాట

పూర్ణామార్కెట్, మార్చి 1: పూర్ణామార్కెట్ దుర్గాలమ్మ జాతర మహోత్సవాల పందిరిరాటను ఎమ్మెల్యే వాసుపల్లి గణేశ్‌కుమార్ ఆధ్వర్యంలో వేదపండితులు శుక్రవారం వేయించారు. అనంతరం పూజలు చేశారు. మహాశివరాత్రి పర్వదినం రోజున ఈనెల 8తోపాటు 9 తేదీల్లో ఘనంగా జాతర జరగనుంది.

రుషికొండను నాశనం చేశారు

» బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు విష్ణుకుమార్ రాజు

సీతమ్మధార, మార్చి 1: అద్భుత పర్యాటక పాంతమైన రుషికొండను వైసీపీ ప్రభుత్వం నాశనం చేసి, ప్యాలెస్ నిర్మించడం శోచనీయమని మాజీ ఎమ్మెల్యే, బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు విష్ణుకుమార్ రాజు ఆవేదన వ్యక్తంచేశారు. సీతమ్మధారలోని పార్టీ కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పర్యాటక శాఖ అభివృద్ధి పేరుతో కోట్లాది రూపాయల ప్రజల సొమ్ము దుర్వినియోగం చేశారన్నారు. రుషికొండను బోడి గుండు చేసిన వైసీపీ ప్రభుత్వాన్ని తరిమి కొట్టాలని పిలుపునిచ్చారు. టీ పార్క్, రాడిసన్ బ్లూ అసలు యజమానులు ఎవరో తెలుస్తూనే ఉందన్నారు. అలాగే, మరో 15 రోజుల్లో ఎన్నికల నోటిఫికేషన్ రానుందని, జగన్ ఇచ్చిన మద్యనిషేధం మా టేమిటని ఆయన ప్రశ్నించారు. విద్యుత్ రేట్లు భరించలేక ఫ్యాక్టరీలు మూతపడ్డాయన్నారు. మళ్లీ జగన్‌కి ఓటు వేస్తే, పిల్లలు, రాష్ట్ర భవిష్యత్తుకు ఉరేసినట్టేనని ఆయన ఆందోళన వ్యక్తంచేశారు. దేశంలో జగన్ మార్చినట్లు ఎమ్మెల్యే సీట్లు ఎవరూ మార్చలేదన్నారు. జగన్ బటన్ నొక్కేది సాక్షి పేపర్‌కు ప్రకటనల కోసమే అన్నారు. వైసీపీ సిద్ధం పోస్టర్లు చూస్తే ఓటు వెయ్యకపోతే దాడి చేస్తామని బెదిరిస్తున్నట్లు ఉందన్నారు.

ఉచిత ఉపకరణాల నమోదు రేపు

ప్రధానమంత్రి వయోశ్రీ యోజన ఉచిత పరికరాల నమోదు కార్యక్రమాన్ని ఈ నెల 3వ తేదీన డీఎల్‌బీ గౌండ్స్‌లో కేంద్ర ప్రభుత్వం అలింకో సంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నట్లు విష్ణుకుమార్ రాజు తెలిపారు. 60 ఏళ్లు పైబడిన తెల్ల రేషన్ కార్డు కలిగిన వారికి ఉచితంగా కళ్లద్దాలు, వీల్ ఛైర్లు, నడుం బెల్ట్‌లు, వినికిడి యంత్రాలు, ఊత కర్రలు, చంక కర్రలు తదితర పరికరాల కోసం పేర్లను నమోదు చేసుకోవాలని కోరారు.



మాట్లాడుతున్న విష్ణుకుమార్ రాజు

రుషికొండను చూసేందుకు ప్రజలను అనుమతించాలి

» టీడీపీ జిల్లా అధ్యక్షుడు పల్లా శ్రీనివాస్

విశాఖపట్నం, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): ప్రజా ధనం వెచ్చించి నిర్మించిన రుషికొండ పర్యాటక భవనంపై ఎందుకు గోప్యత పాటిస్తున్నారని టీడీపీ జిల్లా అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు ప్రశ్నించారు. పార్టీ కార్యాలయంలో శుక్రవారం జరిగిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ప్రభుత్వ ఖజానా నుంచి రూ.450 కోట్లు వెచ్చించి ని ర్మించిన భవనం ప్రారం భోత్సవానికి మీడియాను అనుమతించక పోవడం దారుణమన్నారు. అత్యంత ఖరీదైన భవనం పర్యాటకుల కోసమా, సీఎం క్యాంపు కార్యాలయమా చెప్పలేని దౌర్భాగ్య స్థితిలో ప్రభుత్వం ఉందన్నారు. ప్రజలసొమ్ముతో నిర్మించిన భవనాన్ని చూసేందుకు ప్రజలనే ఎందుకు అనుమతించడం లేదని నిలదీశారు. రుషికొండ సమీప ఐఎన్ఎస్ కళింగలో రక్షణశాఖకు చెందిన అనేక కార్యకలాపాలు జరుగుతున్నందున నిషేధిత ప్రాంతంగా పరిగణస్తారని, అదే కేటగిరీ లోకి రుషికొండ వచ్చిందా అని ప్రశ్నించారు. నాలుగేళ్లగా రుషికొండను నిషేధిత ప్రాంతంగా మార్చేసి, ఏమి నిర్మిస్తున్నారో చెప్పాలని అడుగుతున్నా స్పందించడంలేదన్నారు.

ప్రారంభోత్సవంలో పాల్గొన్న ఇద్దరు మంత్రులు పరస్పర విరుద్ధ ప్రకటనలు చేశారని, దీనిని బట్టి భవనంపై వారికే అవగాహన లేదని ఎద్దేవా చేశారు. పచ్చనికొండను ధ్వంసం చేయడం, జనాన్ని తీవ్ర ఇబ్బందికి గురిచేయడం లాంటి పిచ్చి పనులు చేసినందుకే సీఎం జగన్‌ను సైకో అనిఅంటున్నారని పల్లా అన్నారు.

సంక్షోభంలో వ్యవసాయరంగం

» సీపీఐ నేత సత్యనారాయణమూర్తి



మాట్లాడుతున్న సత్యనారాయణ మూర్తి

అల్లిపురం, మార్చి1: దేశంలో వ్యవసాయరంగం తీవ్ర సంక్షోభంలో ఉందని, ఈ స్థితిలో రైతులను ఆదుకోవాల్సిన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆ దిశగా చర్యలు చేపట్టడం లేదని సీపీఐ రాష్ట్ర సహాయకార్యదర్శి జెవిసత్యనారాయణమూర్తి ఆరోపించారు. శుక్రవారం స్థా నిక పార్టీ కార్యాలయంలో జరిగిన విశాఖ జిల్లా సమితి సమావేశంలో ఆయన మాట్లాడారు. దేశ, రాష్ట్ర రాజకీయ పరిణామాలు, రానున్న ఎన్నికల్లో పార్టీ అ వలంబించాల్సిన వైఖరిని వివరించారు. కేంద్రంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం వ్యవసాయరంగాన్ని ప్రైవేట్ పరం చేయడానికి ప్రయత్నిస్తోందని ఆరోపించారు. ఇక, రాష్ట్రంలో వైసీపీ ప్రభుత్వం ప్రజాపాలనను విస్మరించి రాష్ట్ర ప్రయోజనాలను కేం ద్రంలోని బీజేపీకి తాకట్టు పెట్టిందని విమర్శించారు.జిల్లా కార్యదర్శి ఎం.పైడిరాజు, కార్యవర్గ సభ్యులు ఆర్. శ్రీనివాసరావు, ఎ.విమల, కసిరెడ్డి సత్యనారాయణ, కె.సత్యాంజనేయ. జి.ఎస్.జె. అచ్యుతరావు పాల్గొన్నారు.

చట్ట వ్యతిరేక శక్తిగా వలంటీర్ వ్యవస్థ

» టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మహ్మద్ నజీర్ ధ్వజం



మహారాణిపేట, మార్చి 1: వైసీపీ ప్రభుత్వ నియమించిన వలంటీర్లను చట్టవ్యతిరేక శక్తుల మారుతున్నారని టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మహ్మద్ నజీర్ ఆరోపించారు. శుక్రవారంపార్టీ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన వలంటీర్ల వ్యవస్థపై మాట్లాడారు. వలంటీర్ వ్యవస్థ రానురాను మరీ దారుణంగా మారుతోందన్నారు. అధికార పార్టీ ఇన్‌చార్జిలు.. వలంటీర్ల ద్వారా ఓటర్లకు స్వీట్లు, డబ్బు, చీరలు పంపిణీ చేస్తున్నారన్నారు. వలంటీర్ల వ్యవస్థపై ప్రభుత్వం రూ. 9, 666 కోట్లు ఖ ర్చు చేసిందని తెలిపారు. చీరలు , డబ్బులు పంచుతూ, ఏకంగా గ్రూప్‌ల్లో పెడుతున్నారని, దీనిపై డీజీపీతో పాటు ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేయనున్నట్లు తెలిపారు

విశాఖ- పలాస ప్రత్యేక పాసింజర్ రైళ్లు బ్రహ్మపూర్ వరకు పొడిగింపు

విశాఖపట్నం, మార్చి 1: ప్రయాణికుల డిమాండ్ మేరకు విశాఖ, పలాస మధ్య రాకపోకలు సాగిస్తున్న 08532, 08531 నంబర్లు గల ప్రత్యేక పాసింజర్ రైళ్లను వయా సోంపేట, ఇచ్ఛాపురం మీదుగా బ్రహ్మపూర్ వరకు పొడిగిస్తున్నామని సీనియర్ డీసీఎం ఏకే త్రిపాఠి తెలిపారు. విశాఖ-బ్రహ్మపూర్ ప్రత్యేక పాసింజర్ (08532) రైలు ఈనెల మూడు నుంచి ప్రతిరోజు సాయంత్రం 5.45 గంటలకు విశాఖలో బయలుదేరి రాత్రి 11.10 గంటలకు బ్రహ్మపూర్ చేరుతుంది. తిరుగు ప్రయాణంలో బ్రహ్మపూర్-విశాఖ ప్రత్యేక పాసింజర్ (08531) రైలు ఈనెల నాలుగు నుంచి ప్రతిరోజు తెల్లవారుజాము 3.50కు బ్రహ్మపూర్‌లో బయలుదేరి 9.20 గంటలకు విశాఖ చేరుతుంది.

వీఎంఆర్‌డీఏ చైర్మన్‌కు అభినందనల వెల్లువ



చంద్రమౌళికి శుభాకాంక్షలు తెలుపుతున్న కేకే రాజు, మాజీ మంత్రి శ్రీనివాస్‌రావు తదితరులు

మాధవధార, మార్చి 1; విశాఖ మెట్రో పాలిటన్ రీజియన్ డెవలప్‌మెంట్ అథారిటీ (వీఎంఆర్‌డీఏ) చైర్మన్‌గా నియమితులైన ఉత్తర నియోజకవర్గంలోని మాధవధారకు ఎస్.చంద్రమౌళికి శుక్రవారం పలువురు ప్రముఖులు అభినందనలు తెలిపారు. ముందుగా ఆయన నివాసం నుంచి వెళ్లి మాధవధారలో కొండపై శ్రీ భ్రమరాంబిక మల్లికార్జున దేవస్థానం, శ్రీ లీలా మాధవస్వామి ఆలయాల్లో పూజల్లో పాల్గొని స్వామిలను దర్శించుకున్నారు. అనంతరం మాధవధార 48ఏ రూట్ బస్టాపు నుంచి సిరిపురం వరకు వైసీపీ అభిమానులు, నాయకులు ఏర్పాటు చేసిన ర్యాలీగా వీఎంఆర్‌డీఏ కార్యాలయానికి చేరారు. అక్కడ ఉత్తర నియోజకవర్గ వైసీపీ ఇన్‌చార్జి కేకే రాజు, మాజీ మంత్రి ముత్తంశెట్టి శ్రీనివాసరావు, డిప్యూటీ మేయరు కె.సతీశ్, ఎమ్మెల్సీ వరుదు కల్యాణి తదితరులు, పార్టీల నాయకులు పుష్ప గుచ్ఛాలు అందించి నూతన చైర్మన్‌కు అభినందనలు తెలిపారు.

'దక్షిణం' టికెట్ ఇవ్వాలి

» జగదాంబ మక్కామసీద్ వద్ద ముస్లిం వర్గాలు ఆందోళన



నిరసన వ్యక్తంచేస్తున్న ముస్లింలు

జగదాంబ కూడలి, మార్చి 1: ముస్లీం మైనార్టీలకు రాజకీయాల్లో ప్రాధాన్యత కల్పించిన పార్టీలకే తమ మద్దతు ఉంటుందని జగదాంబ మక్కామసీద్ కమిటీ అధ్యక్షుడు షేక్ అబ్దుల్ మున్నీర్ స్పష్టంచేశారు. శుక్రవారం మసీద్ వద్ద ముస్లీం మైనార్టీ వర్గాలు ఆందోళన చేపట్టాయి. ఈసందర్భంగా మున్నీర్ మాట్లాడుతూ, ఎన్నికల్లో ప్రతిసారీ ప్ర ధాన రాజకీయ పార్టీలు తమకు రాజకీయ ప్రాధాన్యత కల్పించడంలో వివక్షత చూపుతున్నాయని ఆరోపించారు. విశాఖ నగరంలో దాదాపు మూడు లక్షలకు పైగా ము స్లీంలు ఉన్నారన్నారు. ఈ స్థితిలో దక్షిణ నియోజవర్గంలో తమ వర్గం వ్యక్తి పోటీ చేసే అ వకాశం కల్పించాలని డిమాండ్ చేశారు. ఏ రాజకీయపార్టీ అయితే తమ వారికి ఎమ్మెల్యే టికెట్ ఇస్తుందో దానికే సహకరిస్తామన్నారు.ఈప్రదర్శనలో మక్కామసీద్ కమిటీ ప్రతినిధులు, నగరంలోని ముస్లీంలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

44,177 మందికి 'విద్యా దీవెన '

» జేసీ మయూర్ అశోక్

మహారాణిపేట, మార్చి 1: జిల్లా వ్యాప్తంగా జగనన్న విద్యా దీవెన పథకం కింద రూ.34.73 కోట్లు 44,177 మంది పిల్లల తల్లుల ఖాతాల్లోకి జమచేసినట్టు జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్ తెలిపారు. పేద విద్యార్థుల పూర్తి ఫీజు రియింబర్సుమెంట్ కింద 2023 అక్టోబర్ నుంచి డిసెంబరు వరకు త్రైమాసికానికి ఈ పథకం నిధులను శుక్రవారం ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి కృష్ణా జిల్లా పామర్రు నుంచి విడుదల చేశారు. కలెక్టరేట్ కార్యాలయంలో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈసందర్భంగా జేసీ మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా పాలిటెక్నిక్, ఐటీఐ, డిగ్రీ ఇంజనీరింగ్, మెడిసిన్ తదితర కోర్సులు చదువుతున్న 44177 మంది విద్యార్థులకు త్రైమాసిక నిధులు జమ చేసినట్టు చెప్పారు. అనంతరం నమూనా చెక్కును విద్యార్థుల తల్లులకు అందించారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు కోలా గురు వులు, పిల్లి సుజాత, కె. రామారావు , అధికారులు కె, శ్రీ దేవి పాల్గొన్నారు.



లబ్ధిదారులకు చెక్కును అందజేస్తున్న జేసీ మయూర్ అశోక్

బుల్లయ్య కాలేజీ స్వర్ణోత్సవ ర్యాలీ



ర్యాలీని ప్రారంభిస్తున్న కరస్పాండెంట్ మధుకుమార్

సీతమ్మధార, మార్చి 1: డాక్టర్ లంకపల్లి బుల్లయ్య కళాశాల స్వర్ణోత్సవాలు పురస్కరించుకుని విద్యార్థులు ఎలక్ట్రిక్ సైకిళ్ల అవగాహన ర్యాలీని నిర్వహించారు. కళాశాల ఆవరణలో ఈ ర్యాలీని సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ డాక్టర్ జి.మధుకుమార్ శుక్రవారం జెండా ఊపి ప్రారంభించారు. ఈ ర్యాలీ జంగదాంబ జంక్షన్, కలెక్టర్ ఆఫీస్ కార్యాలయం, బీచ్ రోడ్డు, వుడా పార్క్ జంక్షన్, ఆంధ్రా యూనివర్శిటీ, సీఎంఆర్ సెంట్రల్ జంక్షన్ వరకు 8.5 కిలోమీటర్ల మేర సాగింది. ఈ సందర్భంగా మధుకుమార్ మాట్లాడుతూ కళాశాల స్వర్ణోత్సవాలపై ప్రచారంతోపాటు ప్రతి ఒక్కరికీ వ్యాయామం ప్రాధాన్యం తెలిపేలా ఈ ర్యాలీ సాగిందన్నారు. అధ్యాపకులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన

అల్లిపురం,మార్చి 1: జీవీఎంసీ 34వ వార్డులోని కొబ్బరితోట ఎస్‌వీపీ నగర్‌లో రూ. 18.50 లక్షల వ్యయంతో నిర్మించిన వాడబలిజ సేవాసంఘం సామాజిక భవనాన్ని శుక్రవారం స్థానిక ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ వార్డు కార్పొరేటర్ తోటపద్మావతితో కలసి ప్రారంభించారు. వార్డు నాయకులు లింగం శ్రీను, లండా రమణ తదితరులు పాల్గొన్నారు.

నాన్ ఫేర్ రెవెన్యూలో వాల్తేరు డివిజన్ రికార్డు: డీఆర్‌ఎం



డీఆర్‌ఎం సౌరభ్ ప్రసాద్

విశాఖపట్నం, మార్చి 1: నాన్ ఫేర్ రెవెన్యూలో వాల్తేరు డివిజన్ సరికొత్త రికార్డు నెలకొల్పింది. ఈ సందర్భంగా డీఆర్‌ఎం సౌరభ్‌ప్రసాద్ శుక్రవారం నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. గత సంవత్సరంలో పోల్చితే ఈ ఏడాది నాన్ ఫేర్ రెవెన్యూ 48 శాతం పెరిగిందని, ఏప్రిల్ 2023 నుంచి ఫిబ్రవరి 2024 నెలాఖరునాటికి రూ.7.61 కోట్ల ఆదాయం సమకూరినట్టు చెప్పారు. ఎయిర్ కండిషన్డ్ లాంజ్‌లు, కోచ్ రెస్టారెంట్, వందేభారత్ ఎక్స్‌ప్రెస్‌లలో ప్రచార ప్రకటనలు తదితర కార్యకలాపాలను విజయవంతంగా నిర్వహించిన నేపథ్యంలో నాన్ ఫేర్ రెవెన్యూలో డివిజన్ పురోగతి సాధించిందన్నారు. రెస్టారెంట్లను మరిన్ని స్టేషన్లకు విస్తరించడం, 15 అమృత స్టేషన్లలో ఫుడ్ కోర్టులు, వాణిజ్య జోన్‌ల ఏర్పాటు, స్టేషన్ స్థలాల లీజుకు కేటాయింపు, ఆధునిక సదుపాయాలు కల్పన తదితర ప్రణాళికల ద్వారా మరింత ఆదాయం పెంపునకు చర్యలు చేపట్టనున్నట్టు ఆయన పేర్కొన్నారు.

వైభవంగా పార్వతీపరమేశ్వరుల తిరువీధి

సీతంపేట, మార్చి 1: సీతంపేట గణేష్‌నగర్‌లోని పార్వతీశ్వరాలయ వార్షికోత్సవంలో భాగంగా పార్వతీ పర మేశ్వరుల కల్యాణం గురువారం కన్నులపండువగా నిర్వహించారు. ఇందులో భాగంగా స్వామిని, అమ్మవారికి వీధుల్లో వాహనంపై శుక్రవారం ఊరేగించారు.కల్యాణానికి భక్తులు తెచ్చిన సారెతో ఈ వేడుక సాగింది.



స్వామివారి ఊరేగింపులో భక్తులు

భూకబ్జాదారులపై పీడీ యాక్టు

» అవసరమైతే నగర బహిష్కరణ

» 6న భూకబ్జాలపై ప్రత్యేకంగా ఫిర్యాదుల స్వీకరణ

» నగర పోలీస్ కమిషనర్ రవిశంకర్ అయ్యన్నార్

» 'డయల్ యువర్ సీపీ'లో అప్పటికప్పుడు ఓ భూ వివాదం పరిష్కారం

విశాఖపట్నం, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): భూకబ్జాలకు పాల్పడే వారిపై పీడీ యాక్ట్ కింద కేసులు నమోదు చేస్తామని, అవసరమైతే నగర బహిష్కరణ కూడా చేస్తామని పోలీస్ కమిషనర్ రవిశంకర్ అయ్యన్నార్ హెచ్చరించారు. 'డయల్ యువర్ సీపీ' కార్యక్రమంలో శుక్రవారం ఆయన అప్పటికప్పుడు ఓ భూ వివాదాన్ని పరిష్కరించారు. కార్యాలయంలో మధ్యాహ్నం ఫిర్యాదులను చూస్తుండగా ఎండాడకు చెందిన 94 ఏళ్ల వృద్ధురాలు ఎ.యు.భాస్కరదేవి వచ్చారు. తనకు మధురవాడలో విలువైన భూమి ఉందని, దానిని కొందరు కబ్జా చేయడానికి యత్నిస్తున్నారని ఫిర్యాదు చేశారు. వివరాలు పరిశీలించిన సీపీ రవిశంకర్, జాయింట్ సీపీ ఫకీరప్ప, సీనియర్ సిటిజన్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు సీహెచ్ వెంకటరావు, అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి టీఎస్ ప్రసాద్‌తో కలిసి వెంటనే మధురవాడలో ఆ స్థలాన్ని పరిశీలించారు. సంబంధిత సీఐ, ఏసీపీలను పిలిచి తగు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సంఘటనా స్థలంలోనే ఆ ఫిర్యాదును పరిష్కరించారు. తక్షణమే న్యాయం చేసినందుకు భాస్కరదేవి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా సీపీ రవిశంకర్ మాట్లాడుతూ నకిలీ పత్రాలు సృష్టించి భూములు ఆక్రమించే వారిపై, భూకబ్జాదారులపై ఫిర్యాదుల స్వీకరణకు అన్ని పోలీస్ స్టేషన్లలో ఈ నెల 6వ తేదీ ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకూ పోలీసు ఉన్నతాధికారిని అందుబాటులో ఉంచుతామన్నారు. కబ్జాదారులకు సహకరించే ప్రభుత్వ ఉద్యోగులు, ప్రైవేటు వ్యక్తులు, రిటైర్డ్ ఉద్యోగులపై కూడా కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ఇలాంటి అంశాలపై ఫొటోలు, వీడియోలు ఏమైనా ఉంటే తన నంబరు 9493396633 కు వాట్సాప్ ద్వారా తెలియజేయవచ్చునన్నారు.

అప్పన్న కేశఖండనశాలలో ఊడిపడ్డ పైకప్పు పెచ్చులు

» త్రుటిలో తప్పిన పెనుప్రమాదం



ఊడిపడ్డ శ్లాబ్ పెచ్చులు

సింహాచలం, మార్చి 1: సింహాచలం దేవస్థానానికి చెందిన కేశఖండనశాలలోశుక్రవారం పైకప్పు పెచ్చులూడి పడ్డాయి. అయి తే ఆ సమయంలో అక్కడ భక్తులు లేకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. మధ్యాహ్నం 11 గంటల సమయంలో కేశఖండనశాలలో కొందరు భక్తులు తలనీలాలు సమర్పిస్తున్నారు. అదే సమయంలో భవనం తూర్పు వైపు పైభాగంలో పెచ్చులూడిపడ్డాయి. అక్కడ ఎవరూ లేకపోవడంతో ఎటువంటి ప్రమాదం జరగలేదు. ఈ సమాచారం తెలిసిన వెంటనే ఈఓ శ్రీనివాసమూర్తి ఆ ప్రాంతాన్ని పరిశీలించి, తాత్కాలిక ఏర్పాట్లు చేయాలని సిబ్బందిని ఆదేశించారు. కాగా, కేశఖండనశాల భవనానికి 1986లో శంకుస్థాపన చేయగా 1987లో అప్పటి అనువంశిక ధర్మకర్త డాక్టర్ పీవీజీ రాజు ప్రారంభించారు. సు మారు ఏడాది క్రితం కొండపై అభివృద్ధి పనుల పరిశీలనకు వచ్చిన దేవదాయ శాఖ ఇంజనీరింగ్ విభాగం సీఈ కేశఖండనశాల భవనాన్ని పరిశీలించి ప్రమాదకరంగా ఉందని, తక్షణం కూల్చివేయాల్సిందిగా చెప్పారు. కానీ దేవస్థానం అధికారులు పట్టించుకోలేదు. శ్లాబ్ పెచ్చులుఊడిపడుతుండడంతో క్షురకులు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు.

వన్‌టౌన్ 'దండుపాళ్యం గ్యాంగ్ లీడర్' అరెస్ట్

జగదాంబ కూడలి, మార్చి 1: నకిలీ తుపాకీతో నేరాలకు పాల్పడుతున్న విశాఖ వన్‌టౌన్ దండుపాళ్యం గ్యాంగ్ లీడర్‌ను పోలీసులు అరెస్టు చేశారు. వన్‌టౌన్ సీఐ భాస్కర్ అందించిన వివరాలివి.. శివారు ప్రాంతాలను టార్గెట్ చేసుకున్న గ్యాంగ్ లీడర్ ధోని సతీశ్‌కుమార్ అలియాస్ గసగసాలు, అతని అనుచరుడు మనోజ్‌కుమార్ అలియాస్ మారి వన్‌టౌన్ పంజా జంక్షన్ వద్ద ఇటీవల ములగాడ పవన్‌కుమార్ నుంచి ఐఫోన్, అతని వద్ద ఉన్న రూ. 2,500 దౌర్జన్యంగా దోచుకుపోయారు. బాధితుడి ఫిర్యాదుపై ఈకేసు దర్యాప్తులో భాగంగా గురువారం గ్యాంగ్ లీడర్ సతీష్ తోపాటు అతని అనుచరుడు మనోజ్‌కుమార్‌ను అరెస్ట్ చేశారు.ధోని సతీశ్‌పై నగరంలోని అనేక పోలీస్‌స్టేషన్ల పరిధిలో 30 కేసులు ఉన్నట్లు తెలిపారు. గంజాయి, దొంగతనం తదితర అనేక నేరారోపణల్లో ఇప్పటికే జైలు శిక్ష పడినట్లు చెప్పారు.అతని నుంచి 30 సెల్‌ఫోన్లు, నకిలీ తుపాకీ, నగదు స్వాధీనం చేసుకున్నామన్నారు. పలు సెక్షన్లపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ తెలిపారు.

చెత్త తరలింపులో దోపిడీ!

... 5వ పేజీ తరువాయి

నిర్వహణ ఖర్చు పెంచుతున్నారు. దీంతో రెండేళ్ల కిందట సుమారు రూ.1.4 కోట్లకు (ఒక్కొక్కటి) చేరింది. అయితే తాజాగా రెట్టింపు మొత్తానికి అంటే సుమారు రూ.మూడు కోట్లకు పెంచేశారు. అంటే రెండుచోట్లా కలిపి ఏడాదికి రూ.ఆరు కోట్లు చెల్లించాల్సి ఉంటుంది. ఒకేసారి నిర్వహణ వ్యయం రెట్టింపు చేయడంపై అనుమానాలు వ్యక్తంచేస్తున్నారు. రెండేళ్లుగా డీజిల్ ధరలు దాదాపు స్థిరంగానే ఉన్నాయి. సిబ్బంది జీతాలు కూడా పెద్దగా పెంచింది లేదు. కానీ, నిర్వహణ వ్యయం రెట్టింపు చేస్తూ అధికారులు ప్రతిపాదనలు చేయడం, కౌన్సిల్ ఆమోదించడంపై ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

కాంట్రాక్టర్‌తో మిలాఖత్!

సీసీఎస్ నిర్వహణ బాధ్యతలు దక్కించుకుంటున్న కాంట్రాక్టర్‌తో జీవీఎంసీలోని మెకానికల్, ప్రజారోగ్య విభాగం అధికారులు మిలాఖత్ అయ్యారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ విధానం ప్రారంభించినప్పటి నుంచి ఒకే కాంట్రాక్టర్ కొనసాగుతున్నారు. మిగిలిన కాంట్రాక్టర్లు టెండర్‌లో పాల్గొనాలనుకున్నా అనుభవం ఉండాలని నిబంధన పెడుతున్నారు. పైగా ఒక్కోసారి అధికారులు అత్యవసరం పేరుతో ప్రైవేటు వాహనాలను ఏర్పాటుచేసి వాటికి రూ.20 లక్షలు, 30 లక్షలు వరకూ ఖర్చు చేసేలా స్టాండింగ్ కమిటీలో ఆమోదం తీసుకుంటున్నారు. దీనివల్ల జీవీఎంసీకి అదనపు వ్యయం అవుతోంది. జీవీఎంసీ పరిధిలో ముడసర్లోవ, భీమలాపల్లి, భీమిలిల్లో కూడా సీసీఎస్‌లను ప్రారంభించేందుకు కసరత్తు చేస్తున్నారు. వాటి నిర్వహణ కూడా రాసా ఇన్‌ఫ్రాకే కట్టబెట్టాలని భావిస్తున్నట్టు సమాచారం. ఈ వ్యవహారంపై జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్‌వర్మ దృష్టిసారిస్తే అక్రమాలు బయటపడతాయని ఇంజనీరింగ్ విభాగానికి చెందిన కొంతమంది అధికారులు అభిప్రాయపడుతున్నారు.

వీఎంఆర్‌డీఏ వింత పోకడ

... 5వ పేజీ తరువాయి

ఓ బోటును కూడా సిద్ధంగా ఉంచుకున్నారు. అది చాలా తక్కువ సామర్థ్యం కలిగినది కావడం గమనార్హం. తీరం దగ్గర వచ్చే బలమైన అలలకే ఆ బోటు అంత ఎత్తున ఎగిరి పడుతోంది. దానిని నడిపేవారు కూడా పైకి ఎగురుతున్నారు. ఫ్లోటింగ్ బ్రిడ్జిపై నిల్చొన్నవారు కూడా అలలు వస్తే పైకి ఎగరాల్సి వస్తోంది. అక్కడ గజఈతగాళ్లు కూడా పక్కన ఏర్పాటుచేసిన ప్లాస్టిక్ స్తంభాలను గట్టిగా పట్టుకుంటున్నారు. వాటిలో కొన్ని ఇప్పటికే విరిగిపోయాయి. ఇలాంటి ప్రాజెక్టులను ఇలా అలలు ఎక్కువగా ఉండే చోట కాకుండా ప్రశాంతంగా ఉండే ప్రాంతంలో పెట్టుకోవడం మంచిదనే వాదనలు వినిపిస్తున్నాయి.

అన్నీ ఆర్‌కే బీచ్‌లోనేనా..?

విశాఖపట్నంలో ఏ పర్యాటక ప్రాజెక్టు ప్రారంభించాలన్నా దానిని తీసుకువచ్చి ఆర్‌కే బీచ్‌లో పెడుతున్నారు. తెన్నేటి పార్కు నుంచి భీమిలి వరకూ అనేక బీచ్‌లు ఉన్నాయి. వాటిలో పెద్దగా లోతు లేని తీరాన్ని ఎంపిక చేసుకుని ఉంటే బాగుండేది. కానీ అనుమతులు రావడంలో జాప్యం అవుతుందని, ఆర్‌కే బీచ్ అయితే ఎవరికీ ఫైల్ పెట్టాల్సిన అవసరం లేదని దూకుడుగా వెళ్లడం వల్లే ఇప్పుడు సమస్యలు వచ్చాయని అధికారులే అంటున్నారు. అడుగు ముందుకు వేసిన తరువాత వెనుక అడుగు వేస్తే పరువు పోతుందని ఆలోచిస్తున్నారు. పర్యాటకుల ప్రాణాలకు ముప్పు ఉందని తెలిసినా...ఈ ఫ్లోటింగ్ బ్రిడ్జిని అక్కడే నడపడానికి యత్నిస్తున్నారు.

పారా హుషార్!!

... 5వ పేజీ తరువాయి

శరణాలయం నిర్వహిస్తున్నామని సాయం చేయాలని కోరుతుంది. ఈ క్రమంలో ఏయే ఫ్లాట్లకు తాళాలు వేసి ఉన్నాయో గమనిస్తుంది. ఆ వివరాలన్నీ ముఠాలోని నాయకుడు ఆవుల కిరణ్‌కుమార్ అలియాస్ రాహుల్‌కు చెబుతుంది. ఆ తరువాత రాహుల్ రంగంలో దిగి రెక్కీ నిర్వహిస్తాడు. ఏ సమయంలో అక్కడికి వెళ్లి చోరీ చేయవచ్చునో ఒక అంచనాకు వస్తాడు. ఆ ప్రకారం ఫ్లాట్ తాళం విరగొట్టి లోపలకు వెళ్లి విలువైన సొత్తు దోచుకుపోతాడు. ఈ ముఠాలో మరికొందరు సభ్యులు కూడా ఉన్నారు. వీరంతా మారుతీ కారులో తిరుగుతున్నారు. ఈ వివరాలను అన్ని పోలీస్ స్టేషన్లకు పంపించారు. అక్కడి నుంచి సచివాలయాల్లో పనిచేసే మహిళా కానిస్టేబుళ్లకు అందించారు. వారి ద్వారా అన్ని అపార్టుమెంట్లకు చేరవేస్తున్నారు. ఏ ఇంటికైనా, అపార్టుమెంట్‌కైనా అనాధ శరణాలయం, సాయం పేరుతో మహిళలు వస్తే...వెంటనే ఆ సమాచారాన్ని సమీప పోలీస్‌స్టేషన్‌కు అందించాలని నాలుగో పట్టణ క్రైమ్ ఎస్ఐ భాస్కర్ కోరారు. అంతా అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

4న సుద్దాల అశోక్ తేజ రాక

భీమునిపట్నం, మార్చి 1 : ప్రముఖ సినీ గేయ రచయిత, భాషారత్న అవార్డు గ్రహీత డా. సుద్దాల అశోక్ తేజ ఈనెల 4న భీమిలి రానున్నట్టు కళా సాహితి సంస్థ అధ్యక్ష, కార్యదర్శులు పొత్తూరి రాజేంద్రప్రసాద్ వర్మ, అడిదం సన్యాసిరాజు తెలిపారు. శుక్రవారం వారు ఒక ప్రకటన విడుదల చేశారు. ఆ రోజు చిన్నబజారులో వున్న శ్రీనివాస ఫంక్షన్ హాల్‌లో సుద్దాలతో మాట-పాట, ఇష్టాగోష్ఠి జరుగుతుందని చెప్పారు. సాయంత్రం 4 నుంచి 7 వరకూ జరిగే ఈ కార్యక్రమంలో సాహితీప్రియులు అధిక సంఖ్యలో పాల్గొనాలన్నారు.

205 మందికి వైద్య పరీక్షలు

ఆరిలోవ, మార్చి 1 : విమ్స్‌లో శుక్రవారం ఉదయం నిర్వహించిన న్యూరో ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. శిబిరాన్ని విమ్స్ డైరెక్టర్ డాక్టర్ కె. రాంబాబు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైద్యశాలలో కొత్తగా న్యూరాలజీ విభాగం ప్రారంభించామని, వైద్యాన్ని ప్రజలకు చేరువ చేయడానికి ఉచిత శిబిరాలు ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. అనంతరం వైద్యులు 205 మందికి పరీక్షలు చేసి మందులు అందజేశారు. 29 మందికి ఉచితంగా సిటీ స్కాన్, 15 మందికి రక్త పరీక్షలు జరిపారు.

ఫుట్‌పాత్ తొలగించి గేటు ఏర్పాటు

ఆరిలోవ, మార్చి 1 : ఆరిలోవలోని హెల్త్ సిటీలో ఓ ప్రైవేటు ఆస్పత్రి యాజమాన్యం ఫుట్‌పాత్‌ను తొలగించి గేట్ ఏర్పాటు చేయడంపై విమర్శలు తలెత్తుతున్నాయి. ఆస్పత్రి సిబ్బంది బీఆర్‌టీఎస్ రోడ్డులో ఫుట్‌పాత్‌ను తవ్వి ప్రధాన గేటు ఏర్పాటు చేశారు. అలాగే ఆస్పత్రి వెనుక వైపు చినగదిలి సాయిబాబా ఆలయం నుంచి ఆరిలోవ వెళ్లే మార్గంలో మరో గేటు అమర్చారు. ఫుట్‌పాత్‌ను తొలగించి ఇష్టానుసారంగా గేటు ఏర్పాటు చేసినా.. జీవీఎంసీ అధికారులు పట్టించుకోకపోవడం పట్ల ఆరోపణలు వినిపిస్తున్నాయి.

కమనీయం అప్పన్న నిత్య కల్యాణం

సింహాచలం, మార్చి 1 : వరాహలక్ష్మీనృసింహస్వామి ఆర్జిత నిత్య కల్యాణం శుక్రవారం కమనీయంగా సాగింది. వేకువజామున సుప్రభాతాది ప్రభాత సేవలు తరువాత ఉత్సవమూర్తి గోవిందరాజస్వామిని ఉభయ దేవేరులతో ప్రత్యేక వేదికపై అధిష్ఠింపజేశారు. ప్రత్యక్షంగా పాల్గొన్న భక్తుల గోత్రనామాలతో అర్చకులు సంకల్పించి, పాంచరాత్రాగమశాస్త్ర విధానంలో కల్యాణ క్రతువు నిర్వహించారు. మంత్రపుష్పం, కర్పూర నీరాజనాలిచ్చిన తరువాత భక్తులకు వేదాశీర్వచనాలు, శేషవస్త్రాలు, ప్రసాదాలు అందజేశారు.

నిత్యాన్న ప్రసాద పథకానికి రూ.లక్ష విరాళం

సింహాచలం, మార్చి 1 : వరాహలక్ష్మీనృసింహస్వామి దేవస్థానం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న నిత్యాన్న ప్రసాద పథకానికి నగరానికి చెందిన రాజు ఎంటర్‌ప్రైజెస్ అధినేత కరణం వెంకటేశ్వరరావు రూ.1,00,116 విరాళంగా సమర్పించారు. విరాళం మొత్తాన్ని చెక్ రూపంలో శుక్రవారం ఆయన దేవస్థానం ఈఓ సింగల శ్రీనివాసమూర్తికి అందజే శారు. ఆలయ ఆచారం ప్రకారం దాత కుటుంబ సభ్యులకు అధికారులు అంతరాలయ దర్శనం కల్పించి శేషవస్త్రాలు, ప్రసాదాలు, వేదాశీర్వచనాలు అందజేశారు.

కోడి పందాలు ఆడుతున్న 14 మందిపై కేసు నమోదు

ఆనందపురం మార్చి 1 : మండలంలోని గండిగుండం ప్రాంతంలో కోడి పందాలు ఆడుతున్న 14 మందిపై పోలీసులు శుక్రవారం కేసు నమోదు చేశారు. ముందస్తు సమాచారం మేరకు ఈ దాడులు జరిపారు. 14 మందిని అదుపులోకి తీసుకోవడంతో పాటు వారి నుంచి నాలుగు కోళ్లు, రూ. 14250 నగదు స్వాధీనం చేసుకున్నారు.

సామయ్యవలసలో..

పద్మనాభం : పాండ్రంగి పంచాయతీ సామయ్యవలసలో కోడిపందాలు ఆడుతున్న 10 మందిని అరెస్టు చేసినట్టు పద్మనాభం సీఐ శ్రీధర్ చెప్పారు. గ్రామంలోని గోస్తనీ నది సమీపంలో ఉన్న మామిడితోటలో కోడి పందాలు ఆడుతున్నట్టు వచ్చిన సమాచారం మేరకు దాడి చేశామన్నారు. 10 మంది పందెంరాయుళ్లతో పాటు నాలుగు పుంజులు, పది బైకులు, ఏడు సెల్‌ఫోన్లు, రూ. 15640 నగదు పట్టుబడినట్టు ఆయన తెలిపారు.

సినిమా గైడ్

- **చారి 111 :** వెంకటేశ్వర-2, కిన్నెర, శ్రీలక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), సుకన్య (గోపాలపట్నం), మినీ మోహిని (గాజువాక).
- **భూతద్దం భాస్కరనారాయణ :** శారద, శరత్, ఊర్వశి (కంచరపాలెం) సౌజన్య (గోపాలపట్నం), లక్ష్మి (గాజువాక), నటరాజ్ (పెందుర్తి).
- **ఇంటి నెం.13 :** లీలామహల్.
- **మా ఊరి రాజారెడ్డి :** క్రాంతి
- **రాధా మాధవం :** మౌర్య (గోపాలపట్నం)
- **భ్రమయుగం :** జగదాంబ, హెవెన్ (గాజువాక), గణేష్ (తగరపువలస)
- **సుందరం మాస్టర్ :** శ్రీలక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), సప్తగిరి (తగరపువలస)
- **సిద్దార్థ్ రాయ్ :** శ్రీరామ, శ్రీకన్య, మోహిని (గాజువాక), అరుణ (పెదగంట్యాడ)
- **ఊరు పేరు భైరవకోన :** మెలోడి, సంగం, కామేశ్వరి, గోకుల్ ఊర్వశి, నరసింహ (గోపాలపట్నం), కన్య-2 (గాజువాక), సీతారామయ్య (పరవాడ), తాతా (తగరపువలస)
- **ఈగల్ :** రమాదేవి,
- **హనుమాన్ :** శ్రీవెంకటేశ్వర, నరసింహ (గోపాలపట్నం), రాములమ్మ (తగరపువలస)

రైతు బజార్‌లో ధరలు (కిలో/ రూ.ల్లో)

ఉల్లిపాయలు 27,టమాటా 18, వంకాయలు (తెలుపు) 24, వంకాయలు (నలుపు) 54, బెండకాయలు 32, పచ్చిమిర్చి 32, కాకరకాయలు 40, బీరకాయలు 36, ఆనపకాయలు 18, కాలీఫ్లవర్ 30, క్యాబేజ్ 20, క్యారెట్ 28, దొండకాయలు 28, బంగాళా దుంపలు 20, అరటికాయ (పె)7, మునక్కాడలు (కిలో) 65, అల్లం (పాతది) 100, బరబటి 24, ముల్లంగి 20, నిమ్మకాయలు (కిలో) 110, గోరుచిక్కుడు 32, దోస కాయలు 30, వెల్లుల్లి (పెద్దవి) 180, కొబ్బరికాయ (పెద్దది) 22, బీన్స్ (పెన్సిల్) 46, ఆగాకర 52, పొటల్స్ 62, కీరదోస 30, కాప్సికమ్ 54, పొట్లకాయ (పెద్దది) 20, చేమదుంపలు 48, చిలగడదుంపలు 26 , కంద 64, దేముడు చిక్కుడు 46, కొండఉసిరి 65, కరివేపాకు (కిలో) 50, కొత్తిమీర (పెద్దకట్ట) 20, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 3, పాలకూర (కట్ట) 3, తోటకూర (కట్ట) 3, మామిడికాయలు 70, బూడిద గుమ్మడికాయ 26, కర్రపెండలం 24, మామిడి అల్లం 70, బొప్పాయి 34, జామకాయలు (కిలో) 55.

కోడిగుడ్లు (నెక్)

(వంద - రూ.లలో)

విశాఖపట్నం	500
విజయనగరం	504
శ్రీకాకుళం	504

చికెన్ ధరలు

బ్యాగ్

రైతు ధర	--	120
ఫారం ధర	--	140
విత్ స్కిన్	--	250
స్కిన్‌లెస్	--	260

మరికొన్ని సిటీ వార్తలు పేజీ 9 లో..



అబ్దుల్ కలాం పార్కులో వాకర్స్‌తో ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు



పీఎంపాలెం కాలనీలో ప్రచారం చేస్తున్న టీడీపీ నాయకులు

టీడీపీ అధికారంలోకి వచ్చాక పార్కులు అభివృద్ధి

'తూర్పు' ఎమ్మెల్యే వెలగపూడి

వెంకోజీపాలెం, మార్చి 1 : టీడీపీ, జనసేన ఉమ్మడి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక మూలపడిన పార్కులను అభివృద్ధి చేస్తామని తూర్పు ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు అన్నారు. శుక్రవారం ఆయన 16వ వార్డు హెచ్‌బీకాలనీలోని అబ్దుల్ కలాం పార్కును సందర్శించారు. ఈ సందర్భంగా అక్కడున్న వాకర్స్‌తో ముచ్చటించారు.గత టీడీపీ ప్రభుత్వంలో పార్కుకు ఒక రూపు రేఖలు తీసుకువస్తే ప్రస్తుత ప్రభుత్వం దాన్ని పట్టించుకోవడం లేదన్నారు. నగరంలో కొన్ని పార్కులు అసాంఘిక కార్యకలాపాలకు నిలయంగా మారాయని చెప్పారు. టీడీపీ, జనసేన ప్రభుత్వం ఏర్పడ్డాక మూలకు చేరిన, అభివృద్ధికి నోచుకోని పార్కులను అభివృద్ధి చేస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో టీడీపీ 16వ వార్డు అధ్యక్షుడు నారు గోపి, ముగడ వాసు, మొల్లి శంకర్, జి. అప్పన్న, తూర్పు నియోజకవర్గం మహిళా అధ్యక్షురాలు పల్లా ఉమారాణి, 15వ వార్డు అధ్యక్షుడు బుగత సత్యనారాయణ, మళ్ల రవికుమార్, భైరెడ్డి పోతనరెడ్డి, నూకరాజు, ఎర్రాజీ రెడ్డి పాల్గొన్నారు.

126 మందికి కళ్లద్దాలు పంపిణీ

ఆరిలోవ : ఎన్‌టీఆర్ హెల్త్ ట్రస్టు, గీతం ఆస్పత్రి సంయుక్తంగా ఆరిలోవలో ఉచిత వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి, పేదలకు మందులు అందజేయడం అభినందనీయమని తూర్పు ఎమ్మెల్యే వెలగపూడి రామ కృష్ణబాబు అన్నారు. శుక్రవారం ఆయన తోటగరువులోని పార్టీ కార్యాలయంలో పలువురికి కళ్లద్దాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గత నెల ఆరిలోవలోని టీఐసీ పాయింట్ వద్ద నిర్వహించిన మెగా నేత్ర వైద్య శిబిరంలో కంటి పరీక్షలు చేసుకున్న రోగుల్లో అవసరమైన వారికి కళ్లద్దాలు అందజేసినట్టు చెప్పారు. పార్టీ నాయకులు ఒమ్మి సన్యాసిరావు, అప్పలరాజు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో నాయకులు ఏడువాక సన్యాసిరావు. ఒమ్మి పోలారావు, బుడుమూరు గోవింద్, రాగతి అచ్చుతరావు, బాదరు బాలరాజు, దువ్వి తాతారావు పాల్గొన్నారు.

పేదల అభ్యున్నతి.. టీడీపీతోనే సాధ్యం

కొమ్మాది : పేదల అభ్యున్నతి తెలుగుదేశం పార్టీతోనే సాధ్యమని ఆ పార్టీ విశాఖ పార్లమెంట్ తెలుగు యువత ఉపాధ్యక్షుడు గరే గురునాథ్ అన్నారు. శుక్రవారం పార్టీ నాయకులు పీఎంపాలెం కాలనీలో ఇంటింటికి వెళ్లి సూపర్ సిక్స్ పథకాల గురించి ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా గురునాథ్ మాట్లాడుతూ రాష్ట్రం అభివృద్ధి చెందాలంటే విజన్ ఉన్న నాయకుడు చంద్రబాబు ముఖ్యమంత్రి కావాలన్నారు.

కల్తీ మద్యంతో పేదల బతుకులు ఛిద్రం

ఆరిలోవ, మార్చి 1 : మద్యం, కల్తీ మద్యం అమ్మకాల వల్ల పేదల బతుకులు నాశనమవుతున్నాయని ఏపీ మహిళా సమాఖ్య జిల్లా కార్యదర్శి ఎండీ బేగం అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం పురస్కరించుకుని శుక్రవారం ఏపీ మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో మహిళలు ఆరిలోవ ఆఖరి బస్టాపు సమీపంలో ఉన్న శివాజీనగర్‌లో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తాము అధికారంలోకి వస్తే మద్య నిషేధం విధిస్తామని చెప్పిన ముఖ్యమంత్రి జగన్ ఇచ్చిన హామీని అమలు చేయకపోగా మద్యం అమ్మకాలను మరింతగా ప్రోత్సహిస్తున్నారన్నారు. కల్తీ మద్యం వల్ల అనేక మంది మృతి చెందుతున్నారని, కుటుంబాలు రోడ్డున పడుతున్నాయని ఆవే దన వ్యక్తం చేశారు. వచ్చే ఎన్నికల్లో వైసీపీ ప్రభుత్వానికి బుద్ధి చెప్పడానికి మహిళలంతా సిద్ధంగా ఉన్నారన్నారు. ఈ కార్యక్రమంలో మహిళా సమాఖ్య ఏరియా ప్రధాన కార్యదర్శి బొత్స పుష్పలత, మహిళా నేతలు సరస్వతి, రూప, సత్యవతి, లక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.



ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తున్న మహిళలు

8 నుంచి త్రిమూర్తిక శివ జయంత్యుత్సవాలు

వెంకోజీపాలెం, మార్చి 1 : బ్రహ్మకుమారీస్ ఆధ్వర్యంలో ఈనెల 8 నుంచి మూడు రోజుల పాటు త్రిమూర్తిక శివ జయంతి ఉత్సవాలు నిర్వహించనున్నట్టు బ్రహ్మకుమారి రామేశ్వరి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎండాడలోని దుర్గాదేవి ఆలయం పక్కనున్న స్కైలైన్ అపార్టుమెంట్‌కు ఎదురుగా శివలింగం ఏర్పాటు చేసి ఈ కార్యక్రమం నిర్వహించనున్నట్టు చెప్పారు. శారదా పీఠాధిపతి స్వరూపానందేంద్రస్వామిజీ వేడుకలను ప్రారంభిస్తారన్నారు. పూర్తి వివరాలకు 9177744966 నంబరు ను సంప్రతించాలని ఆమె సూచించారు.

విద్యార్థులు సామర్థ్యాలను పెంచుకోవాలి : వీసీ

వెంకోజీపాలెం, మార్చి 1 : విద్యార్థులు నిరంతరం తమ సామర్థ్యాలను వృద్ధి చేసుకోవాలని ఏయూ వీసీ ఆచార్య పీవీజీడీ ప్రసాదరెడ్డి సూచించారు. శుక్రవారం ఏయూ మహిళా ఇంజనీరింగ్ కళాశాలలో మెకానికల్ ఇంజనీరింగ్ విభాగంలో నిర్వహించిన యాత్రిక 2కె 24 సదస్సును ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మార్కులు అవసరమని, కానీ అవే ప్రధానం కాదన్నారు. నైపుణ్యాలను సరిచూసుకోవడం,వాటిని నిరంతరం మెరుగుపరచుకోవడం ఎంతో అవసరమన్నారు. ఏఐ, బ్లాక్ చైన్, ఎంఐ, ఐఓటీ, ఇండస్ట్రీ 4.0 వంటి సాంకేతికతలను అన్ని శాస్త్రాలతో మిళితం చేస్తూ ఉపయుక్తంగా నిలుపుకోవాలని సూచించారు. ఎడ్‌ఎక్స్‌తో ప్రభుత్వం చేసుకున్న ఎంఓయూలు విద్యార్థులకు ఎంతో ఉపయుక్తంగా నిలుస్తున్నాయన్నారు.

నూతన భవనాలు ప్రారంభం

ఏయూ మహిళా ఇంజనీరింగ్ కళాశాలలో నూతనంగా నిర్మించిన కల్పనాచావ్ల భవనం మొదటి, రెండవ అంతస్థులను విద్యార్థులతో కలిసి వీసీ ప్రసాదరెడ్డి శుక్రవారం ప్రారంభించారు. దాదాపు రూ.4 కోట్ల వ్యయంతో 24 వేల చదరపు అడుగుల విస్తీర్ణంలో అధునాతన సెమినార్ హాల్, ఆరు తరగతి గదులు, 2 ల్యాబ్‌లను నిర్మించారు. ఈ కార్యక్రమంలో పలువురు అధికారులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న 'వ్యవసాయం' నాటిక

మద్దిలపాలెం, మార్చి 2 : పిఠాపురం కాలనీ కళాభారతి ఆడిటోరియంలో శుక్రవారం ప్రదర్శించిన వ్యవసాయం నాటిక ఆకట్టుకుంది. మనిషి తనలోని స్వార్థం, దోపిడీ, అవినీతి, అధర్మమనే కలుపు మొక్కలను ఏరి మంచిని పంచాలన్న సందేశంతో ప్రదర్శించిన ఈ నాటిక సభికులను ఆలోచింపజేసింది. అధర్మం, అన్యాయంతో బతికే సుయోధనరావు ధర్మానికి నిదర్శనంలా జీవించే ధర్మారావును వేధించి ప్రాణాలు తీస్తాడు. చివరకు మంచి తెలుసుకుని ధర్మారావులా మారిపోతాడు. కళాకారులు తమ పాత్రల్లో అద్భుతంగా నటించి శ్రోతలను మెప్పించారు.



పుస్తకావిష్కరణ

వెంకోజీపాలెం, మార్చి 1 : ఏయూ విద్యా విభాగాధిపతి ఆచార్య టి. షారోన్ రాజు, డాక్టర్ ఎం. తేజోమయి సంయుక్తంగా సంకలనం చేసిన ' ఏ స్టడీ ఆఫ్ ది ఇన్ఫులెన్స్ ఆఫ్ ఐసీటీ బేస్డ్ మల్టీ మీడియా ఫర్ ఎన్‌హేన్సింగ్ బయోలాజికల్ సైన్స్ లెర్నింగ్ ఇన్ సెకండరీ స్కూల్స్ ' అన్న పుస్తకాన్ని రాష్ట్ర తెలుగు అకాడమీ చైర్‌పర్సన్ డాక్టర్ ఎన్. లక్ష్మీపార్వతి, ఏయూ వీసీ ఆచార్య పీవీజీడీ ప్రసాదరెడ్డి శుక్రవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా లక్ష్మీపార్వతి మాట్లాడుతూ ఆచార్యులు పరిశోధన ఫలితాలను పుస్తక రూపంలో తీసుకురావడం వల్ల ఎందరికో ఉపయుక్తంగా నిలుస్తుందన్నారు. ఈమేరకు పుస్తక రచయిత షారోన్ రాజును అభినందించారు.

గురుకులంలో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

భీమునిపట్నం, మార్చి 1 : గురుకుల పాఠశాలలు, జూనియరు, డిగ్రీ కళాశాలల్లో వచ్చే విద్యాసంవత్సరానికి సంబంధించి ప్రవేశాలకు ప్రభుత్వం నోటిఫికేషన్ విడుదల చేసిందని భీమిలి ఏపీ గురుకుల బాలికల పాఠశాల ప్రిన్సిపాల్, జిల్లా కోఆర్డినేటర్ కోడి రాంబాబు తెలిపారు. శుక్రవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. రాష్ట్రంలోని 38 గురుకుల పాఠశాలల్లో 5వ తరగతిలో ప్రవేశానికి, 6,7,8 తరగతుల్లో మిగులు సీట్లు భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నా రన్నారు. అలాగే ఏపీఆర్‌జేసీ సెట్ ద్వారా ఏడు గురుకుల జూనియరు కళాశాలలు నాగార్జునసాగర్ వద్ద ఉన్న డిగ్రీ కళాశాలలో మొదటి సంవత్సరం ప్రవేశాలకు కూడా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఆసక్తి గల వారు https://aprs.apcfss.in ద్వారా ఆన్‌లైన్‌లో మాత్రమే దరఖాస్తు చేసుకోవాలని చెప్పారు.ఈనెలాఖరు వరకూ దరఖాస్తులకు గడువు ఉందన్నారు. కాగా 5వ తరగతిలో ప్రవేశాలకు నిర్వహించే పరీక్ష ఏప్రిల్ 25న ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12 వరకూ, జూనియర్, డిగ్రీ కళాశాలల ప్రవేశ పరీక్ష మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 5 వరకు జరుగుతుందన్నారు. రాష్ట్రంలోని 12 మైనారిటీ గురుకుల పాఠశాలల్లో 5వ తరగతిలో ప్రవేశానికి, 6,7,8 తరగతుల్లో మిగిలి వున్న ఖాళీల భర్తీకి, జూనియరు కళాశాలల్లోనూ మైనారిటీ కోటా సీట్లు ప్రవేశాలకు అర్హులైన వారు పరీక్ష రాయనవసరం లేదన్నారు.

అప్పన్న సన్నిధిలో స్వాతి నక్షత్ర హవనం



పూర్ణాహుతి సమర్పిస్తున్న అర్చకులు

సింహాచలం, మార్చి 1 : నృసింహస్వామి ఆవిర్భావ నక్షత్రాన్ని పురస్కరించుకుని వరాహలక్ష్మీనృసింహస్వామి సన్నిధిలో స్వాతి నక్షత్ర హవనాన్ని శుక్రవారం సంప్రదాయబద్ధంగా నిర్వహించారు. వేకువజామున సుప్రభాతసేవతో స్వామివారిని మేల్కొలిపి ప్రభాత ఆరాధనలు పూర్తి చేశారు. స్వామివారి ప్రతినిధిగా సుదర్శన పెరుమాళ్‌ను పల్లకిలో ఉంచి యాగశాల వద్ద ఏర్పాటు చేసిన ప్రత్యేక వేదికపై అధిష్ఠింపజేశారు. ఆలయ స్థానాచార్యులు డా. టిపి రాజగోపాల్ పర్యవేక్షణలో ప్రధానార్చకులు రమణాచార్యులు, గొడవర్తి శ్రీనివాసాచార్యులు సారథ్యంలో అర్చకులు ముందుగా మండపారాధన, బింబారాధన, కలశారాధనలు జరిపి పాల్గొన్న భక్తులకు నృసింహ యంత్రాన్ని ఇచ్చి, వారి చేతుల మీదుగా నృసింహ అష్టోత్తర శతనామావళి పఠిస్తూ పూజలు జరిపించారు. అనంతరం ముందుగా సిద్ధం చేసిన హోమగుండంలో అగ్నిప్రతిష్ఠాపన చేసి తొలుత పంచసూక్తాలతో, తర్వాత నృసింహ, సుదర్శన మూల మంత్రాలతో హవనాన్ని జరిపారు. భక్తులు స్పృశించిన తరువాత మహాపూర్ణాహుతి జరిపి, ప్రధాన కలశాన్ని ప్రధానార్చకులు రమణాచార్యులు శిరస్సున దాల్చి అంతరాలయంలో మూలవిరాట్ వద్ద ఉంచి పూజలు చేశారు. మంత్రపుష్పం, కర్పూర నీరాజనాలిచ్చి ప్రత్యక్షంగా పాల్గొన్న జంటలకు వేదాశీర్వచనాలు, శేషవస్త్రాలు, ప్రసాదాలు అందజేశారు. ఈఓ శ్రీనివాసమూర్తి ఏఈఓలు భమరాంబ, నరసింగరావులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

క్వాంటమ్ మిషన్‌తో సాంకేతిక ప్రగతి

సాగర్‌నగర్, మార్చి 1 : గణిత, భౌతిక శాస్త్రాలు, కంప్యూటర్ సైన్స్‌లోని మౌలిక అంశాల ఆధారంగా పనిచేసే క్వాంటమ్ టెక్నాలజీతో దేశ సాంకేతిక ప్రగతి భవిష్యత్తుకు అందించాలని న్యూఢిల్లీలోని జాతీయ పరిశోధన సంస్థ నేషనల్ ఫిజిక్స్ లేబోరేటరీ (ఎన్‌పీఎల్) డైరెక్టర్ ప్రొఫెసర్ అచెంట వేణుగోపాల్ వెల్లడించారు. గీతం డీమ్డ్ విశ్వవిద్యాల యంలో భౌతికశాస్త్ర విభాగం, ఇండియన్ ఫిజిక్స్ అసోసియేషన్ (ఐపీఏ) విశాఖ శాఖ సంయుక్తంగా శుక్రవారం నిర్వహించిన భౌతిక శాస్త్రవేత్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. సాంకేతిక పరిజ్ఞానం కోసం ఇతర దేశాలపై ఆధార పడకుండా పూర్తి స్వదేశీ పరిజ్ఞానాన్ని అభివృద్ధి చేయడానికి క్వాంటమ్ మిషన్ ఉపయోగపడుతుందన్నారు. ఈ మిషన్ ఆధారంగా పరిశోధకులు సెమీకండక్టింగ్ టెక్నాలజీల అభివృద్ధి, 6జీ టెక్నాలజీ, క్వాంటమ్ కంప్యూటింగ్, గ్రీన్ ఎనర్జీ పరిశోధనలపై దృష్టిసారించాలని సూచించారు. కోల్‌కత్తాలోని క్వాంటమ్ ఎకోసిస్టమ్స్ అండ్ టెక్నాలజీ కౌన్సిల్ ఆఫ్ ఇండియా డైరెక్టర్ ప్రొఫెసర్ అరుణ్ కె. పతి మాట్లాడుతూ క్వాంటమ్ కంప్యూటింగ్ పరిజ్ఞానం ద్వారా వివిధ రంగాల్లో కలిగే ప్రయోజనాలను వివరించారు. ఈ సమావేశంలో గీతం స్కూల్ ఆఫ్ సైన్స్ డీన్ ప్రొఫెసర్ కేఎస్ కృష్ణ, గీతం విశిష్ట ప్రొఫెసర్లు బీవీఆర్ టాటా, గురజాడ రవికుమార్, ప్రొఫెసర్ ఎం. చైతన్య, డాక్టర్ కవిత, రమేష్, తదితరులు పాల్గొన్నారు.

వ్యాసరచన, వక్తృత్వ పోటీలు

వెంకోజీపాలెం, మార్చి 1 : ఏయూలోని దుర్గాబాయ్ దేశ్‌ముఖ్ మహిళా అధ్యయన కేంద్రం ఆధ్వర్యంలో ఈనెల 8న అంతర్జాతీయ మహిళా దినోత్సవం పురస్కరించుకుని తెలుగు విభాగం సమావేశ మందిరంలో మహిళా సాధికారత - ఆవశ్యకత అన్న అంశంపై విద్యార్థులకు శుక్రవారం వ్యాసరచన, వక్తృత్వ పోటీలు నిర్వహించారు. తెలుగు శాఖాధిపతి ఆచార్య జర్రా అప్పారావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి ఆర్ట్స్ అండ్ కామర్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య నరసింహారావు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ దుర్గాబాయ్ దేశ్‌ముఖ్ మహిళా అధ్యయన కేంద్రం డైరెక్టర్ డాక్టర్ పల్లవి, తెలుగు ఆచార్యులు డాక్టర్ ఏ. ఈశ్వరమ్మ, డాక్టర్ బూసి వెంకటస్వామి, తదితరులు పాల్గొన్నారు.

తీరంలో ఆలివ్ రిడ్లే తాబేలు కళేబరం

సాగర్‌నగర్, మార్చి 1 : సాగర్‌నగర్ తీరానికి శుక్రవారం ఉదయం కొన ఊపిరితో ఉన్న ఆలివ్ రిడ్లే తాబేలు చేరింది. బీచ్‌కు వచ్చిన సందర్శకులు దాన్ని కాపాడేందుకు సముద్ర జలాల్లోకి వదిలినప్పటికీ తిరిగి తీరానికి చేరి ప్రాణాలు విడిచింది. మర పడవలు, సముద్ర జలాల కాలుష్యం వల్ల తాబేళ్లు చనిపోతున్నాయని మత్స్యకారులు చెబుతున్నారు.



'జూట్‌మిల్లు భూములను ఆక్రమిస్తాం'

తగరపువలస, మార్చి 1 : కార్మికులకు బకాయిలు చెల్లించకుండా భూముల అమ్మకాలకు ప్రయత్నిస్తున్న జూట్ మిల్లు యాజమాన్యం తీరును అన్ని కార్మిక సంఘాల నాయకులు ఖండించారు.శుక్రవారం వారు కాంగ్రెస్ కార్మిక సంఘం కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. మిల్లు యాజమాన్యం పరిహారాలు చెల్లించకుండా స్థలాల అమ్మకానికి ప్రయత్నిస్తుందన్నారు. కార్మికులకు పీఎఫ్ బకాయి చెల్లించకపోతే చదును చేసి ఖాళీగా ఉన్న స్థలాలను ఆక్రమిస్తామని హెచ్చరించారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ కార్మిక సంఘం నాయకులు కైలాస్ రెడ్డి, దల్లి అప్పలరెడ్డి, ఎం. ఆదినారాయణ, ఏఐటీయూసీ నాయకులు అల్లు బాబూరావు, కొండపు ఈశ్వరరావు, టీఎన్‌టీయూసీ నాయకులు దేముళ్ల రామారావు, అచ్చారావు పాల్గొన్నారు.

యువతకు ఓటుహక్కుపై అవగాహన

పద్మనాభం (రూరల్), మార్చి 1 : కొత్తగా ఓటుహక్కు పొందిన యువతకు టీడీపీ నాయకులు అవగాహన కల్పిస్తున్నారు. రాష్ట్రం బాగుండాలంటే చంద్రబాబు ముఖ్యమంత్రి కావడం అవసరమని వివరిస్తున్నారు. ఈమేరకు శుక్రవారం వారు మద్ది, తునిపొలం, అనంతవరం, గొల్లలపాలెంలో పర్యటించారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల మాజీ అధ్యక్షుడు కాళ్ల నగేష్‌కుమార్, నాయకులు బుగత ప్రకాష్, కె. సన్యాసినాయుడు, ఎస్, వెంకటరావు, అప్పల సూర్యనారాయణ, తాతాజీ పాల్గొన్నారు.

మమతా బెనర్జీ ప్రభుత్వ వైఖరికి నిరసనగా బీజేపీ ధర్నా

సిరిపురం, మార్చి 1 : పశ్చిమ బెంగాల్‌లోని సందేశ్‌ఖలీలో మహిళలపై జరుగుతున్న అకృత్యాలపై స్పందించని మమతా బెనర్జీ ప్రభుత్వ వైఖరికి నిరసనగా బీజేపీ విశాఖపట్నం మహిళా మోర్చా ఆధ్వర్యంలో జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద శుక్రవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సాగి కాశీవిశ్వనాథరాజు మాట్లాడుతూ సందేశ్‌ఖలీలో షాజహాన్ షేక్ టీఎంసీ ఎమ్మెల్యే మహిళలపై చేస్తున్న అకృత్యాలకు నిరసనగా బాధితులు 55 రోజులుగా ధర్నా చేస్తున్నా.. ఆ రాష్ట్ర సీఎం పట్టించుకోకపోవడం దారుణమన్నారు.



భీమిలి : ప్రభుత్వ జూ. కళాశాలలో పరీక్ష రాసి బయటకు వస్తున్న విద్యార్థులు

ఇంటర్ ఫస్ట్ ఇయర్ పరీక్షలు ప్రారంభం

భీమునిపట్నం, మార్చి 1 : పట్టణంలో శుక్రవారం నుంచి ఇంటర్ ప్రథమ సంవత్సరం పరీక్షలు ప్రారంభమయ్యాయి. తొలిరోజు తెలుగు, సంస్కృతం, హిందీ పరీక్షలు నిర్వహించారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకూ పరీక్షలు జరిగాయి. స్థానిక ప్రభుత్వ జూనియరు కళాశాలలో 553 మంది పరీక్ష రాయాల్సి ఉండగా 531 మంది, గొల్లలపాలెంలోని సెడార్ జూనియరు కళాశాలలో 490 మందికి 486 మంది హాజరయ్యారు. అన్ని కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు చేశారు. ప్రథమ చికిత్స కిట్లు కూడా అందుబాటులో ఉంచారు. కేంద్రాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయడంతో ఏ ఒక్కరిని అధికారులు కేంద్రంలోకి అనుమతించలేదు.

ఆరిలోవ : ఆరిలోవలోని శ్రీకృష్ణాపురం అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో 526 మందికి 525 మంది పరీక్షకు హాజరయ్యారు.తెలుగు పరీక్షకు 503 మంది, సంస్కృతం పరీక్షకు 22 మంది హాజరయ్యారు. ఈ కేంద్రంలో సుమారు 32 సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు.

క్యాంపస్ ఇంటర్వ్యూలో 92 మంది ఎంపిక



ఎంపికైన విద్యార్థినులతో కళాశాల ప్రిన్సిపాల్, అధ్యాపకులు

భీమునిపట్నం, మార్చి 1 : పట్టణంలోని ప్రభుత్వ మహిళా పాలిటెక్నిక్ కళాశాలలో సినర్జీ క్యాస్టింగ్స్ లిమిటెడ్ నిర్వహించిన క్యాంపస్ ఇంటర్వ్యూల్లో వివిధ బ్రాంచ్‌లకు చెందిన 92 మంది విద్యార్థినులు ఎంపికయ్యారు.ఈమేరకు కళాశాల ప్రిన్సిపాల్ సీహెచ్ మురళీకృష్ణ శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. సివిల్ ఇంజనీరింగ్‌లో 39, కమర్షియల్ అండ్ కంప్యూటర్ ప్రాక్టీస్ విభాగం నుంచి 37, కంప్యూటర్ ఇంజనీరింగ్ నుంచి 4, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్స్ నుంచి 12 మంది ఉద్యోగాలకు ఎంపికయ్యారు. ఎంపికైన వారికి ఏడాది శిక్షణ వుంటుందని, ఆ సమయంలో రూ. 14 వేలు వరకూ వేతనం ఇస్తామని కంపెనీ నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో కంపెనీ ట్రైనింగ్ అండ్ ప్లేస్‌మెంట్ ఆఫీసరు శ్రీనివాస్, సీనియరు మేనేజరు సుబేదా బేగం, సీనియరు ఆఫీసరు పేరోల్, కళాశాల ప్రిన్సిపాల్ మురళీకృష్ణ, కమర్షియల్ అండ్ కంప్యూటర్ ప్రాక్టీస్ విభాగాధిపతి డా. జి. రాజేశ్వరి పాల్గొన్నారు.

బ్రెయిన్ స్ట్రోక్ చికిత్స విభాగం ప్రారంభం



విభాగాన్ని ప్రారంభిస్తున్న విమ్స్ డైరెక్టర్ రాంబాబు

ఆరిలోవ, మార్చి 1 : విమ్స్‌లో అత్యాధునిక వైద్య సదుపాయాలతో ఏర్పాటు చేసిన బ్రెయిన్ స్ట్రోక్ చికిత్స విభాగాన్ని ఆస్పత్రి డైరెక్టర్ డాక్టర్ కె. రాంబాబు శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అధిక పని వత్తిడి వల్ల బ్రెయిన్ స్ట్రోక్ వస్తుందని, రోగి త్వరగా కోలుకునేందుకు అత్యాధునిక సదుపాయాలు, మందులతో విభాగాన్ని ప్రారంభించామని చెప్పారు. యూనిట్ ద్వారా వేలాది రూపాయలు విలువ చేసే ఇంజక్షన్లు, మందులను రోగులకు ఉచితంగా అందిస్తామని తెలిపారు. బ్రెయిన్ స్ట్రోక్ వచ్చిన వారికి మూడు లేదా నాలుగు గంటల్లో టెనెక్టి ప్లస్ అనే ఇంజక్షన్ ఇవ్వాలని, దాని ఖరీదు సుమారు రూ. 50 వేలు ఉంటుందన్నారు. త్వరలో గ్యాస్ట్రో ఎంటరాలజీకి సంబంధించిన సేవలను, ఓబీసిటీకి సంబంధించిన సేవలను కూడా అందుబాటులోకి తీసుకురానున్నట్టు చెప్పారు.

ఎన్నికల విధులపై అవగాహన

విశాలాక్షినగర్, మార్చి 1 : ఎన్నికల విధి విధానాలపై ఆర్మ్‌డ్ రిజర్వు పోలీసులు అవగాహన కలిగి ఉండాలని ఎలక్షన్ సెల్ సీఐ కె. కుమారస్వామి అన్నారు. కైలాసగిరి కొండ దిగువున ఉన్న ఆర్మ్‌డ్ రిజర్వు మైదానంలో శుక్రవారం ఆయన ఎన్నికల విధి విధానాలపై పోలీసు సిబ్బందికి శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన ఎన్నికలు నిర్వహించే ప్రాంతాల్లో ఎన్నికల ప్రారంభం నుంచి ముగిసే వరకు పోలీసుల విధులు, ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలు వంటి అంశాలపై వివరించారు. ఈ కార్యక్రమంలో ఏఆర్ డీఎస్పీ పి. నాగేశ్వరరావు, రిజర్వు ఇన్‌స్పెక్టర్లు పాల్గొన్నారు.

సుదర్శన నారసింహ యాగశాల నిర్మాణంపై చర్చ

సింహాచలం, మార్చి 1 : ఐదేళ్ల విరామం తరువాత సింహాద్రినాథుని సన్నిధిలో ఈనెల 26 నుంచి జరిగే సుదర్శన నారసింహ మహాయజ్ఞంలో ప్రధానమైన యాగశాల నిర్మాణంపై ఈఓ శ్రీనివాసమూర్తి సారథ్యంలో అధికారులు శుక్రవారం చర్చలు జరిపారు. ఈ సందర్భంగా ఈఓ మాట్లాడుతూ దాతలు, భక్తులు యజ్ఞంలో పాల్గొనేందుకు వీలుగా సువిశాలమైన యాగశాల ఏర్పాటు చేయాలని అధికారులకు సూచించారు. యజ్ఞంలో ఉభయ దాతలు ప్రతి నిత్యం ఐదు వందల మంది పాల్గొనే అవకాశం ఉందని చెప్పారు. దాని తగ్గట్టుగా ఒకేసారి వెయ్యి మంది కూర్చోవడానికి, అప్పన్న దర్శనం అనంతరం యజ్ఞం చూడాలనుకునే సాధారణ భక్తులకు, ప్రముఖులకు వేర్వేరుగా ప్రవేశం కల్పించే విధంగా మార్గాల రూపకల్పన ఉండాలని తెలిపారు. చర్చల్లో ఈఓతో పాటు ఈఈ దండు గణ శ్రీనివాసరాజు, ఏఈఓలు పాలూరి నరసింగరావు, భ్రమరాంబ, ఏఈ బాబ్జీ పాల్గొన్నారు.

అనిట్స్‌లో ఎలక్ట్రా సాంకేతిక సమ్మేళనం

తగరపువలస, మార్చి 1 : సంగివలస అనిట్స్ ఇంజనీరింగ్ కళాశాలలో శుక్రవారం ఎలక్ట్రా 2024 పేరుతో సాంకేతిక సమ్మేళనం నిర్వహించారు. ఏయూ మెకానికల్ ఇంజనీరింగ్ విభాగం అధిపతి, అంబేడ్కర్ యూనివర్సిటీ మాజీ వీసీ డా. కె. రాంజీ ముఖ్యఅతిథిగా హాజరై ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా విద్యార్థులు పేపర్ ప్రెజెంటేషన్, ఎలక్ట్రానిక్స్ సర్క్యూట్స్ రూపకల్పన, సాంకేతిక క్విజ్, రోబోటిక్స్ వర్కుషాప్ వంటి వివిధ అంశాలను ప్రదర్శించారు. సమ్మేళనం రెండు రోజుల పాటు జరుగుతుందని కళాశాల ప్రిన్సిపాల్ శ్రీరామకృష్ణ తెలిపారు. ఈ కార్యక్రమం లో ఈసీఈ విభాగం అధిపతి బండి జగదీష్, రాజ్యలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు. అంతకుముందు రాంజీ చేతుల మీదుగా సావనీర్‌ను ఆవిష్కరించారు.

వివాదాల జోలికి వెళ్తే చర్యలు : సీఐ

పద్మనాభం (రూరల్), మార్చి 1 : ఎన్నికల సమయంలో ఎవరైనా వివాదాల జోలికి వెళితే బైండోవర్ కేసులు నమోదు చేస్తామని సీఐ శ్రీధర్ హెచ్చరించారు. శుక్రవారం ఆయన పలు గ్రామాల్లో పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎన్నికల సమయంలో శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే ఎంతటి వారిపైనైనా కేసులు నమోదు చేస్తామని చెప్పారు. ఆయనతో పాటు ఎస్ఐ సురేష్ ఉన్నారు.

'మిమ్స్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి'

సిరిపురం, మార్చి 1 : విజయనగరం జిల్లా నెలిమర్ల మహారాజా ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్స్ (మిమ్స్) కాంట్రాక్ట్ ఉద్యోగుల డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ సీఐటీయూ విశాఖ జిల్లా కమిటీ శుక్రవారం జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద శుక్రవారం సంఘీభావం తెలిపింది. ఈ సందర్భంగా సీటూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్‌కేఎస్‌వీ కుమార్ మాట్లాడుతూ మిమ్స్ ఉద్యోగులు 2020 కోవిడ్ ముందు వేతన ఒప్పందంపై నోటీస్ ఇచ్చి సమ్మెలోకి వెళ్లే లోపు కోవిడ్ రావడంతో ప్రజలకు ఇబ్బంది రాకుండా ఉండేం దుకు సమ్మె విరమించారని గుర్తు చేశారు. కాంట్రాక్ట్ ఉద్యోగులందరినీ రెగ్యులర్ చేయాలని, బకాయి వున్న ఏడు డీఏలు చెల్లించాలని, వేతన ఒప్పందం అమలు చేయాలని, తొలగించిన కార్మికులను విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు.